# ఏరియా హాస్పిటల్ నూతన భవనాలకు రూ.22కోట్లు : ఎమ్మెల్యే


నూతన భవన నిర్మాణంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

గూడూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నూతన భవనాలకు ప్రభుత్వం 22 కోట్లు మంజూరు చేసిందని పనులు కూడా వేగవంతంగా జరుగుతూ ఉన్నాయని హాస్పటల్ కొరకు తీసుకున్న పక్కనే ఉన్న ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం సంబంధించిన ఐదు సెంట్ల భూమిని కూడా స్టేడియంకి కేటాయించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంకు ఎమ్మెల్యే వరప్రసాద్ విచ్చేశారు. పక్కనే జరుగుతున్న హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు తెలియజేసారు. ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతూ, ఉన్నాయని గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు డివిజన్‌లో ప్రజలందరూ ఎక్కువ సంఖ్యలో వస్తూ ఉంటారని ఈ హాస్పిటల్‌ను జిల్లా హాస్పిటల్‌గా చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి 22 కోట్ల రూపాయిల నిధులు మంజూరు చేయించామని కోరడం జరిగిందని సిఎం నిధులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన భవన నిర్మాణాలు జరుగుతూ ఉన్నాయని పక్కనే ఉన్న ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంకు సంబంధించిన ఐదు సెంట్లు భూమిని హాస్పిటల్ నిర్మాణాలకు తీసుకున్నారని అయితే ఈ స్థలం క్రీడాకారులకు ఎంతో అవసరం కాబట్టి ఆ ఐదు సెంట్ల భూమిని తిరిగి స్టేడియంలోనే ఉంచాలని ఉన్నతాధికారులకు తెలియజేశామని వారు అంగీకరించారని కాంట్రాక్టర్ ఆ స్థలాన్ని వదిలివేసి మిగతా ప్రాంతంలో నిర్మాణ పనులు చేయాలని సూచించామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ఒక్క ఛాన్స్ అంటూ...

# దోచేశారు

- చట్టబద్దత లేని దిశా - మాటలకే పరిమితం మద్యపాన నిషేధం
- అభయహస్తం సొమ్ము మింగేశారు
- శేషాపురం సమావేశంలో సిఎం జగన్‌పై లోకేష్ ఫైర్


శేషాపురం నందు మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా లోకేష్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ఒక్క ఛాన్స్ ఇవ్వండి...! అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సిపి పెద్దలు రాష్ట్రంలో మొత్తం దోచుకొన్నారని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 8వ రోజు శుక్రవారం మొగిలి నుండి నారా లోకేష్ ప్రారంభించారు. అంతకుముందు స్వయంభూ మొగిలీశ్వరస్వామిని లోకేష్ దర్శించుకొని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలు పొందారు. మొగిలి, గాండ్లపల్లి, లక్ష్మీపురం, మొగిలి మిట్టూరు, బలిజపల్లి, పాలమాకులపల్లి, శేషాపురం వరకు పాదయాత్రను చేశారు. శేషాపురంలోని సర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని నారా లోకేష్ మాట్లాడారు. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఇష్టానుసారంగా తన అనుచర గణానికి రాష్ట్రంను దోచి పెట్టారని ధ్వజమెత్తారు. చంద్రన్న బీమా పథకంను నిర్వీర్యం చేశారన్నారు. 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన దిశా చట్టంకు అసలు చట్టబద్దతే లేదన్నారు. ఇంత వరకు రాష్ట్రంలో దిశా చట్టం కింద శిక్షలు పడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. దశల వారీగా మద్యపాన నిషేధం చేపడ్తామని చెప్పిన సిఎం వైఎస్ జగన్ మద్యం ధరలను విపరీతంగా పెంచారన్నారు. మద్యం తయారీ, మద్యం అమ్మకాలను తన బినామీదారులచే వ్యాపారం చేస్తూ కోట్లు గడిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులు అధికంగా వున్నారని పేరుకే జాబ్ క్యాలెండర్ ప్రకటించారన్నారు. అమర్‌రాజా ప్రక్క రాష్ట్రంలోకి వెళ్ళడంతో సుమారు 20 వేల మంది ఉపాధి కొల్పోవాల్సి వచ్చిందన్నారు. అభయహస్తం పథకంలో వున్న 2,200 కోట్ల రూపాయలను వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళా ఖాతాల నుండి మళ్ళించుకొందని పేర్కొన్నారు. పాలిచ్చే ఆవును మరచి తన్నే దున్నపోతును తెచ్చుకొన్నామని వైఎస్ జగన్‌పై వ్యంగంగా వాఖ్యలు చేశారు. 2019లో తెలుగుదేశం ఓడిపోలేదని కేవలం ఆంధ్రరాష్ట్రం ఓడిపోయిందని చెప్పారు. నాపై ఇప్పటి వరకు ప్రభుత్వం 16 కేసులు పెట్టిందని ఈ కేసులకు నేను భయపడేది లేదన్నారు. నాకు జైలు అత్తారింటితో సమానమని పోరాటమే ధ్యేయంగా ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. అలాగే రోజు రోజుకు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రజలను చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో యువగళం పాదయాత్రకు శ్రీకారం చుట్టానని చంద్రబాబునాయుడును రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమరనాధరెడ్డి, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, మాజీ ఎఎంసి ఛైర్మన్ జయచంద్ర నాయుడు, మాజీ ఎంపిపి సుచిత్ర, యువగళం కో-ఆర్డినేటర్ వంశీధర్‌చౌదరి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, ఎన్ఆర్ఐ విక్రమ్ చౌదరి, టిడిపి నాయకులు హేమచంద్రనాయుడు, కమలనాధరెడ్డి, లోకనాధనాయుడు పలువురు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

-మాస్టర్‌ప్లాన్‌పై పాలకమండలి, ఉభయదారులతో చర్చించండి : మంత్రి పెద్దిరెడ్డి


పూజా ద్రవ్యాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మంత్రి

కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు పెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారి ఆలయ పరిసరాల అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని రాష్ట్ర విద్యుత్, అటవీ పర్యావరణ మరియు మైనింగ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం కాణిపాకం స్వామివారిని దర్శించుకుని పలు సేవల్లో పాల్గొన్నారు. ఈఓ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ పాకలమండలి ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు దేవస్థానం మాస్టర్‌ప్లాన్ అమలుపై చర్చించారు. ఆలయ అభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తున్నామని ఇందుకు సహకరించాలని మంత్రిని కోరారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సత్య ప్రమాణాల దేవుడైన శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని తెలిపారు. మాస్లర్ ప్లాన్ రానున్న కాలంలో భక్తులు మరిన్ని ఏర్పాట్లు చేసేలా వుండాలన్నారు. ఆలయ అభివృద్ధిపై సీఎంతో చర్చిం చేందుకు ఎప్పుడైనా తాను సిద్ధంగా వుంటానని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, పలువురు ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

**గణనాధుని సేవలో...**

రాష్ట్ర విద్యుత్, అటవీ పర్యావరణ మరియు మైనింగ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన మంత్రికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఆలయ మాజీ

# పరిశ్రమలకు రూ.5కోట్లు ఆమోదం

-పి.ఎం. ఈ.జి.పి. రుణాలను సకాలంలో గ్రౌన్డింగ్ చేయాలి
- పరిశ్రమలు ఆస్తి పన్నుల బకాయిలను సత్వరమే చెల్లించాలి : కలెక్టర్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి 88 క్లైమ్స్‌కు రూ.5.10 కోట్లు అమోదమైనట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. పి.ఎం.ఈ.జి.పి రుణాలను సకాలంలో గ్రౌన్డింగ్ చేయాలని, ఎపిఐఐసి పరిధిలోని పరిశ్రమల ఆస్తి పన్ను బకాయిలను యాజ మాన్యాలు సత్వరమే చెల్లించాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.సి.పి) సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఎం.ఎస్.ఎం.ఈల ఏర్పాటుకు మండల స్థాయిలో జరిగే సమావేశాలలో పరిశ్రమల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించాలని, పరిశ్రమల శాఖ ఏపిఐఐసి బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో అన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం (పి.ఎం.ఈ.జి.పి) కింద కెవిఐసిలను సమీక్షిస్తూ లక్ష్యసాధనలో పురోగతి మెరుగుపడాలని, ఎల్.డి.ఎం. వాటి అనుబంధ బ్యాంకులు లోన్లు ఇచ్చేలా సత్వరమే గ్రౌన్డింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో జిల్లా ఏర్పడిన నాటి నుండి 465 పరిశ్రమలకుగాను 450 అనుమతులు ఇచ్చామని, మరో 18 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 88 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.5.10 కోట్లు అందించటానికి నేడు అమోదం తెలిపినట్లు తెలిపారు. పెట్టుబడి సబ్సిడి 67, విద్యుత్ సబ్సిడీ 10, వడ్డీ రాయితీ 10, స్టాంప్ డ్యూటీ 1 అమోదించిన వాటిలో ఉన్నాయన్నారు. సి.డి.పి ప్రోగ్రామ్ కింద ఉడ్ క్వారింగ్ క్లస్టర్, మాధవ మాల, ఏర్పడు మండలం, కాపర్ వేజెల్స్ క్లస్టర్ ఎర్రమరెడ్డి పాలెం, వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, తిరుపతి సుహానా సోని, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవన ప్రమాణాలకు...

# మెరుగైన చర్యలు

- రాష్ట్ర ప్రణాళిక విభాగం కార్యదర్శి జిఎస్ఆర్‌కెఆర్ విజయకుమార్


జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రణాళిక విభాగం కార్యదర్శి

చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు మరింత అట్టడుగు స్థాయికి తీసుకెళ్ళి పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళిక విభాగం ప్రభుత్వ కార్యదర్శి జిఎస్ఆర్‌కెఆర్ విజకుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక విభాగం ప్రభుత్వ కార్యదర్శి జిఎస్ఆర్‌కెఆర్ విజయకుమార్ కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధన, స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం, ఎంపీ లార్డ్స్ నిధుల వినియోగం తదితరాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక స్థితిని అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి తీసుకెళ్ళడానికి రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా నవరత్నాలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు పేదరికం నుండి ఎన్నో కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి నవరత్నాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల్లో మార్పు తీసుకువచ్చేలా పథకాల అమలు తీరు వుండాలన్నారు. పోషకాహార లోపం కారణంతో చిన్నారుల్లో ఎదుగుదల లోపం, బరువు లేకపోవడం వంటి సమస్యలు వుంటాయని దీనిని అధికమించడానికి ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో బరువు, ఎత్తు తక్కువ వుండే పిల్లల ఆరోగ్య పెరుగుదలపై దృష్టి సారించాలన్నారు. అలాగే బడి బయట వున్న పిల్లలను బడికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపుతూ అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వాలన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు త్వరితంగా పూర్తి చేయాలని, ఎంపీ లాంర్డ్స్ కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు వైద్యఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ, విద్యాశాఖలు సమన్వయంతో విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. బరువు, ఎత్తు తక్కువ వున్న పిల్లలను చిన్న పిల్లల డాక్టర్ వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ప్రస్తుతం అందిస్తున్న పోషక ఆహారంతో పాటు అదనపు పోషకహారం అందిస్తున్నామన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను పక్కాగా నిర్వహిస్తున్నామని, గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లల్లో రక్తహీనత నివారణకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ దేవానందం, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగాభవానీ, డిఇఓ విజయేంద్రరావు, ఎస్ఎస్ఎ పిఓ వెంకటరమణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుశాఖకు...

# 120 ద్విచక్ర వాహనాలు వితరణ

-హీరో మోటార్స్ యాజమాన్యం దాతృత్వం
-జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన కలెక్టర్,ఎస్పి

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా హీరో మోటార్స్ యాజమాన్యం వారు 120 ద్విచక్రవాహనాలు పోలీసు శాఖకు హీరో ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి జిల్లా కలెక్టర్ వారికి అందజేసారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణ, జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి, హీరో మోటార్ అధినేత మోహన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాకు అనేక సవాళ్ళు ఉన్నాయని రాష్ట్రంలో తిరుపతి నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం, తిరుపతి నగర కేంద్రంగా తిరుమల పుణ్యక్షేత్రం, ఎడ్యుకేషనల్ హబ్, ఇండస్ట్రియల్ హబ్ ఉన్నందున అనునిత్యం నగరానికి 2.5 లక్షలు నుండి 3 లక్షల వరకు ప్రజల రాకపోకలున్నాయి. అందువల్ల నగరంలో శాంతి భద్రతలను కాపాడే విషయంలో విధి నిర్వహణలో పోలీస్ శాఖకు సరైన పెట్రోలింగ్ వాహనాలు లేక సిబ్బంది తమ సొంత వాహనాలతో గస్తీ కాస్తున్నారు. ఈ విషయాన్నీ గమనించిన హీరో మోటార్స్ యాజమాన్యం వారు కార్పొరేట్ సామజిక భాధ్యతలో భాగంగా అధునాతనమైన పూర్తి పోలీస్ పరికరాలతో అమర్చిన 120 ద్విచక్రవాహనాలను పోలీస్‌శాఖకు అందించే కార్యక్రమాన్ని చెప్పటడం చాలా అభినందనీయమన్నారు. అనతరం ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో 53 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, శాంతి భద్రతలను పర్యవేక్షించడానికి పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో తమ సొంత వాహనాలను ఉపయోగించడం తరచుగా జరుగుతూఉంది. ఈ విషయాన్ని గమనించిన సదరు హీరో మోటార్స్ కంపెనీ యాజమాన్యం వారు శాఖాపరమైన అనుమతితో 120 అదునాతమైన ద్విచక్రవాహనాలను పోలీస్ శాఖకు ఇవ్వడం జరిగింది. వీటి వలన పోలీసు శాఖ దినసరి విధులలో భాగంగా పగటి, రాత్రి గస్తీలకు, దిశా పెట్రోల్లింగ్‌లను మరింత శక్తివంతంగా నిర్వర్తించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. హీరో మోటార్స్ కంపెనీలో 50 శాతం మహిళా ఉద్యోగులే ఉన్నారని, షిఫ్ట్ సమయాలలో పోలీస్ పెట్రోల్ నిర్వహించి ప్రశాంతంగా వారి కుటుంబాలకు చేరే విధంగా చూస్తున్నారని అందుకే ఉడతాభక్తిగా భాగస్వామ్యం అయ్యామనితెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, జిల్లా ఎస్పి పి. పరమేశ్వరరెడ్డి వారు జెండా ఊపి 120 ద్విచక్రవాహనాల శ్రేణిని ప్రారంభించారు. అడిషనల్ ఎస్‌పిలు వెంకటరావు అడ్మిన్, కులశేఖర్ ఎల్అండ్ఓ, విమల కుమారి క్రైమ్, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, లక్ష్మీ నారాయణ రెడ్డి ఎఆర్, డిఎస్పిలు సురేంద్ర రెడ్డి ఎస్బి, నరసప్ప వెస్ట్, సురేష్ క్రైమ్, జగదీష్ నాయక్ శ్రీసిటి, నంద కిషోర్, రవీంద్ర రెడ్డి ఏఆర్, ఎంటిఓ రెడ్డప్ప రెడ్డి, హీరో మోటార్స్ చక్రవర్తి, రాజేష్‌కుమార్, కిరణ్, డీలర్స్ పృధ్విరెడ్డి, మోహన్‌రెడ్డి, పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.



# సహకారం అందించండి

- తమిళనాడు మంత్రికి మంత్రి రోజా వినతి



నగరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని నేత పరిశ్రమ ప్రధానంగా తమిళనాడులోని వ్యాపార సంస్థలపై ఆధారపడి ఉందని వారి అభివృద్ధికి మీ తరపు నుంచి సహకారం అందించాలని తమిళనాడు టెక్స్‌టైల్స్ మంత్రి హ్యాండ్‌లూమ్ మంత్రి రోజా విన్నవించుకున్నారు. శుక్రవారం తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం నిమిత్తం విచ్చేసిన తమిళనాడు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి హ్యాండ్‌లూమ్ మంత్రి రోజాను నగరిలోని ఆమె నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రోజా ఆయనకు పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రితో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక శాతం నేత పరిశ్రమపై ఆధారపడి ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం తరపున అందించాల్సిన సహకారం అందిస్తున్నామన్నారు. అయితే వ్యాపార రీత్యా వారు అధిక శాతం ఆధారపడి ఉన్నది తమిళనాడు లోని టెక్స్‌టైల్ పరిశ్రమపైనే కావడంతో అక్కడి నుంచి కూడా సహకారం అందించాలని కోరారు. నింద్ర మండలం, ఎంఎస్‌వీఎం పురంలోను టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించనున్నామని సంబంధిత పనులు జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. అలాగే విజయపురం మండలం కోసలనగరంలో సెజ్ ఏర్పాటు కానుందని అక్కడకు పరిశ్రమలు రావడానికి ఉన్న పరిశ్రమలు వ్యాపార రీత్యా పుంజుకోవడానికి తమిళనాడు వస్త్ర పరిశ్రమ తరపు నుంచి సహకారం అందించాలని కోరారు. దీనిపై మంత్రి గాంధీ మాట్లాడుతూ తప్పక సహకారం అందిస్తామన్నారు. ఆయన వెంట తమిళనాడు వాలాజా ఛైర్మన్ వినోద్, నంద్యాల ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో వైద్య పరికరాల కోసం...

# ఐఓసిఎల్ రు.22కోట్లు విరాళం



తిరుపతినగరం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త: స్విమ్స్‌లో వైద్య పరికరాల కొనుగోలు కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రు.22కోట్లును విరాళంగా అందించేందుకు ముందుకొచ్చింది. టిటిడీ పరిపాలన భవనంలోని ఈవో ఛాంబర్‌లో శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఈవో ఏవి ధర్మారెడ్డి సమక్షంలో ఐఓసిఎల్ స్విమ్స్ అధికారులు ఎంఓయు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ మార్కెటింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌లో రోగులకు వైద్య సహాయం అందించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఈ నిధులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈఓ ధర్మారెడ్డి టిటిడీ తిరుమలలో భక్తులకు, స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపి గురుమూర్తి, జెఇవో సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఐఓసీఎల్ ఎపి, తెలంగాణా ఇంచార్జి అనిల్‌కుమార్, రాయలసీమ రీజనల్ హెడ్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రికి దక్షిణకైలాసం ముస్తాబు

-ముంచుకొస్తున్న ముక్కంటి సంబరాలు...శరవేగంగా పనులు


ఆలయంలో విద్యుత్‌లైట్ల - గోపురాలకు రంగులు వేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆలయంలో అడుగుపెట్టిన వెంటనే సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు రూపుదిద్దుతున్నారు. ఇప్పటికే నెల రోజుల నుంచి ఆలయం లోపల విద్యుత్ దీపాలంకరణలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆలయం అంతా రంగు రంగుల ముగ్గుల మయం చేస్తున్నారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది. ఆలయంలో ఎటు చూసినా ముస్తాబులే ముస్తాబులు అన్నట్లు మారింది. ఈనెల 13వతేదీ భక్తకన్నప్ప ధ్వజారోహణంతో అంకురార్పణ కానుంది. 14వతేదీ స్వామివారి ధ్వజారోహణం, 15వతేదీ సూర్యప్రభ, రాత్రి భూత శుక వాహనసేవ, 16వ తేదీన ఉదయం హంస, యాళివాహనసేవ, రాత్రి రావణ మయూర వాహనసేవ, 17వ తేదీన ఉదయం హంస శుకవాహనసేవ, రాత్రి శేషవాహనం, యాళివాహనసేవ, 18వతేదీన మహాశివరాత్రి ఉదయం ఇంద్రవిమానం-చప్పరవాహనసేవ, రాత్రి నంది, సింహవాహనసేవ, 19న ఉదయం రథోత్సవం, రాత్రి నారదపుష్కరిణిలో స్వామి అమ్మ వార్ల తెప్పోత్సవం, 20వతేదీన ఉదయం అధికారనంది, కామధేనువు వాహనసేవ, రాత్రి గజ, సింహవాహనసేవ, 21వ తేదీన ఉదయం రుద్రాక్ష అంబారి వాహనసేవ, రాత్రి సభాపతి కళ్యాణం, 22న ఉదయం బనాత అంబారి వాహనసేవ కైలాసగిరి ప్రదక్షిణ, రాత్రి అశ్వ సింహ వాహనసేవ, 23వతేదీన ఉదయం తీర్థవారి ధ్వజావరోహణం, 24వ తేదీన రాత్రి స్వామిఅమ్మవార్ల పల్లకీసేవ, 25న రాత్రి ఏకాంతసేవ, 26న స్వామిఅమ్మవార్ల శాంతి అభిషేకాలతో పూర్తవుతాయి.



# ప్రతిభ కల్గిన విద్యార్థులకు విదేశీ విద్యలో పెద్దపీట : జడ్పీ చైర్మన్



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ప్రతిభకు పెద్దపీట వేస్తూ విదేశాలకు వెళ్ళి విద్య అభ్యసించే విద్యారులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమంను పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నారని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యాదీవెన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా 19.95 కోట్ల రూపాయలు బటన్ నొక్కి లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సచివాలయం నుండి జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కర్నూలు ఐసిడిఎస్ రాయలసీమ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజారెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మీ, బిసి వేల్ఫేర్ డిడి రబ్బానీ భాషా, ట్రైబల్ వెల్ఫేర్ డిడి మూర్తిలు హాజరయ్యారు. జగనన్న విదేశీ విద్యదీవెన పథకంకు చిత్తూరు జిల్లా నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా వారికి ప్రభుత్వం మొత్తం 78.01 లక్షల రూపాయలు ఇవ్వనుండగా మొదటి విడతగా శుక్రవారం 16.06 లక్షల రూపాయలు విడుదల చేసింది. ఈ పథకంలో పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం కీలపట్ల పంచాయతీ మాదిగపల్లెకు చెందిన పి.చందన కజకిస్థాన్‌లోని అల్ ఫరాభి కజక్ యూనివర్సిటీలో చదువుతుండగా ఆమె ఫీజు 24.01 లక్షలు కాగా మొదటి విడతగా ప్రభుత్వం ఆమెకు 6 లక్షల రూపాయలు జమ చేసింది. అలాగే పుంగనూరు నియోజకవర్గం సోమల బంగారావారిపల్లికు చెందిన గీతిక అనే విద్యార్థి యూనివర్సిటీ ఆఫ్ మేరీ ల్యాండ్‌లో సీటు రాగా ఆమె విద్యకు మొత్తం 26.46 లక్షల రూపాయలు ఖర్చు కానుండగా ప్రభుత్వం మొదటి విడతగా 6.61 లక్షల రూపాయలు విడుదల చేసింది. అలాగే రామకుప్పం మడలంకు చెందిన లోకేష్‌కు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సీటు లభించగా ఇందుకోసం 27.54 లక్షల రూపాయలు ఫీజు చెల్లించాల్సి వుండగా ప్రభుత్వం మొదటి విడతగా ప్రభుత్వం 3.44 లక్షల రూపాయలు విడుదల చేసింది.

## పక్కాగా ఫ్రైడే-డ్రైడే - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రకాశం



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంను పక్కాగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రకాశం ఆదేశించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని 9వ డివిజన్‌లో డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశం, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్‌లు విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయ సిబ్బంది, విద్యార్థులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశం మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఫ్రైడే-డ్రైడే పాటించడం ద్వారా అంటువ్యాధుల నుండి రక్షణ పొందవచ్చునన్నారు. చిత్తూరు నగర పరిధిలో ఫ్రైడే డ్రైడే పురస్కరించుకొని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో అన్ని డివిజన్లలో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సహాయ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ పీరూసాహెబ్, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, వార్డు కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## త్రీవీలర్ స్కూటర్ అందజేసిన ఎమ్మెల్యే



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** విభిన్న ప్రతిభావంతులకు శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రభుత్వం మంజూరు చేసిన త్రీవీలర్ స్కూటర్లను అందజేశారు. చిత్తూరు వైకాపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నియోజకవర్గ పరిధిలో త్రీవీలర్ స్కూటర్లు మంజూరైన ఆరు మంది లబ్దిదారులకు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలను అందజేస్తున్నారన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని కోరారు.

## కాణిపాకం హుండీ ద్వారా 99 లక్షలు ఆదాయం



**కాణిపాకం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 99 లక్షలు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 15 రోజులకు గాను హుండీల ద్వారా 99,01,458 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 50 గ్రాముల బంగారు, 1 కిలోల 300 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 930 అమెరికా డాలర్లు, 25 యూఏఈ దినార్స్, 1015 ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఇంగ్లాండ్ ఫౌండ్, 12 సింగపూర్ డాలర్లు, 847 మలేషియా రింగిట్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హేమమాలిని,హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లుకోదండపాణి,శ్రీధర్‌బాబు,శ్రీనివాస్,యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం : ఎమ్మెల్సీ



**కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సిఎం జగనన్నతోనే సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీ నిమ్మకంపల్లి, కుంజేగానూరు, సజ్జలపల్లిలో గడపగడపకు మీ కార్యక్రమంను ఆయన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైకాపా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్దిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని మురుగేష్,మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పక్కాగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



**యాదమరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. యాదమరి మండలం దాసరాపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని జోడిచింతల గ్రామంలో శుక్రవారం జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందాయా! లేదా! అని ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. సంక్షేమ పథకాలకు అర్హులై వుండి మంజూరు కాకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి వారు ఆర్థికంగా ముందడుగు వేయడానికి కృషి చేస్తున్నారన్నారు. పథకాలు పొందిన వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సురేష్‌బాబు, ఎంపిడిఓ శివరాజ్, తహసిల్దారు చిట్టిబాబు, పిఆర్ ఎఇ జయచంద్రారెడ్డి, వ్యవసాయ అధికారిణి చరిత, మాజీ జడ్పీటిసీ మనోహరన్, మాజీ సర్పంచ్ మాదిరెడ్డిపల్లి మనోహర్‌రెడ్డి, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గర్భవతులకు పౌష్టికాహారం విరాళం



**చౌడేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరు, పెద్దకొండా మర్రి అంగన్‌వాడీ కేంద్రాలకు దాత పౌష్టికాహారాన్ని విరాళంగా అందించారు. కేంద్రం పరిధిలోని రక్తహీనతతో బాధపడుతున్న గర్భవతులు, బాలింతలకు ఎంపిటీసీ సభ్యురాలు షహీనాహుసేన్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేసారు. ఐసిడిఎస్ ఎసిడిపిఓ సరళాదేవి, సూపర్‌వైజర్ సులోచనా, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన సింగిల్‌విండో అధ్యక్షులు



**పెద్దపంజాణి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నూతనంగా సింగిల్‌విండో అధ్యక్షులుగా నియమితులైన రెడ్డివారి ఓబుల్‌రెడ్డి(సంపల్లి బాబు) శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సింగిల్ విండో బ్యాంకు శాశ్వతభవనం ఏర్పాటుకు స్థలం,నిధులు కేటాయించాలని,అభివృద్ధికిసహాయసహకారులు అందించాలని కోరడం జరిగింది. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సింగిల్‌విండో బ్యాంకుఅభివృద్ధికి త్వరలో అన్నివిధాలుగా సహాయసహకారాలు అందిస్తామని మంత్రి హామీఇచ్చారన్నారు.

## కుప్పం తహశీల్దార్ బదిలీ



**కుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త** కుప్పం మండల తహశీల్దార్ వి.సురేష్‌బాబును పెనుమూరు తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో ఉప తహశీల్దారుగా పనిచేస్తున్న దేవరాజ్‌కు తహశీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా తహశీల్దార్ సురేష్‌బాబు రామకుప్పం ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా సైతం పనిచేస్తున్నారు.

## కుప్పంలో కులరాజకీయాలకు తెరలేపింది తెదేపానే : వైస్‌ఛైర్మన్



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కుప్పంలో కులరాజకీయాలకు తెరలేపింది తెలుగుదేశం పార్టీయేనని కుప్పం మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపా నేతలు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. తెదేపా నేత కాణిపాకం వెంకటేష్ ఎమ్మెల్సీ భరత్‌ను తెలంగాణా వ్యక్తి అని పేర్కొంటున్నారని అలా అయితే చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు ఎవరని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ భరత్‌కు కుప్పంలో ఓటు ఉందని చంద్రబాబు, నారా లోకేష్‌లకు కనీసం ఓటు లేదనే విషయం మరచిపోయారా?అని ప్రశ్నించారు. ఇకపై ఎమ్మెల్సీ భరత్ గురించి మాట్లాడితే తాము కూడా తగు రీతిలో బుద్ధి చెబుతామన్నారు.

# చంద్రబాబునాయుడు ఎర్రచందనం మాఫియాకు కింగ్ - జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** 2014-19 కాలంలో ఎర్రచందనం మాఫియాకు మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు కింగ్‌గా వ్యవహరించారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ధ్వజమెత్తారు. జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలమనేరులోనారాలోకేష్‌నిర్వహించిన యువగళం పాదయాత్రలో జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అటవీ దొంగ వీరప్పన్‌తో పోల్చారని, అయితే 2014-19 కాలంలో అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడు మాజీ సిఎం నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని ప్రోత్సహించి స్మగ్లర్లతో చిత్తూరు, కడప జిల్లాలోని ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేశారన్నారు. మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు స్వస్థలం నారావారిపల్లిలోని ఆయన సొంత భూముల్లో పట్టుబడిన ఎర్రచందనం దుంగలే దీనికి సాక్ష్యం అన్నారు. అలాగే జిల్లాలో ఇసుక మాఫియా రాజ్యం ఏలుతుందని నారా లోకేష్ ఆరోపించారని గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తహసిల్దారు వనజాక్షిని ఇసుక రీచ్‌లోనే హత్య చేయడానికి ప్రయత్నిస్తే అతనిపై కేసు లేకుండా స్వయంగా అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడే పంచాయతీ నిర్వహించడం ఎవరు మర్చిపోలేదన్నారు. జిల్లాలో సైతం ఇసుక అక్రమ రవాణా చేస్తూ కూలీలపై వాహనాలు ఎక్కించి హత్యలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీ వారిదని పేర్కొన్నారు. అప్పటి సిఎం ఎన్టీఆర్ రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేస్తే ఆపై నారా బాబు సారా బాబు కాలేదా! అని ప్రశ్నించారు. జిల్లాలో మంత్రి ఎపెద్దిరెడ్డి సారధ్యంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుంటే తెలుగుదేశం నాయకులకు బాధ కల్గుతుందన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పులికాట్ సరస్సు తీరంలో నేచర్ క్యాంప్



**తడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా వన్యమృగ సంరక్షణ అధికారులు పులికాట్ సరస్సు తీరంలో నేచర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ప్రకృతితో పాటు పక్షులు, వన్యప్రాణులను సంరక్షించుకోవడంలో భాగంగా భవిష్యత్ తరాలకు వాటి అవసరాన్ని చాటిచెప్పడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట కేంద్రంగా ఉన్న వన్యప్రాణి సంరక్షణ శాఖ పరిధిలో అటు దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రం, ఇటు సూళ్లూరుపేట, తడ మండలాల్లో విస్తరించిన పులికాట్ సరస్సు, విశాలమైన అటవీ ప్రాంతాల సంరక్షణలో స్థానికులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు జరుపుతున్నామని డిఎఫ్ శామ్యూల్ తెలిపారు. సమీపంలోని కొన్ని ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలలను గుర్తించి విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడమే కాకుండా వన్యప్రాణి చట్టాల గురించివివరిస్తున్నట్లుచెప్పారు. పలువురురేంజ్‌అధికారులు, అటవీశాఖసిబ్బంది పాల్గొంటున్నారు.

## చేపల వేటకు వెళ్ళి శవమయ్యాడు!



**తడ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తడ మండలం ఇరకం దీవికి చెందిన వల్లంబెడు కత్తి (40) శుక్రవారం పులికాట్ సరస్సులో చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు అందులోపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్త సూళ్ళూరుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మత్స్యకారుడు దుర్మరణం

**వాకాడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** వాకాడు మండలం దుగ్గరాజపట్నం పంచాయతీ పరిధిలోని కొండూరు పాలెం గ్రామంకు చెందిన దక్షాది చిన్నయ్య అను వ్యక్తి శుక్రవారం చేపల వేట సాగిస్తూ హటాత్తుగా బకింగ్ హామ్ కలువలో పడిపోయాడు. అతనిని కాపాడేందుకు స్థానిక గజ ఈతగాళ్ల తీవ్ర ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. కొన్ని గంటల తర్వాత కాలువలో ఆ మత్స్యకారుడు వికతజీవిగా దొరికాడు. హుటాహుటిన వైద్య సేవలు అందించిన, అప్పటికే దక్షాది చిన్నయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి ప్రమాదవశాత్తు మరణించిన ఆ కుటుంబాన్నికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని పంచాయితీ సర్పంచ్ శ్రావణి, వైకాపా నాయకుడు మహేంద్ర జిల్లా కలెక్టర్, గూడూరు శాసన సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సముద్రంలో చేపల వేట వెళ్లే మత్స్యకారులందరికి లైఫ్ జాకెట్లు పంపిణీ చేయడం పాటు జీవిత బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరుచున్నారు.

## డీవిసత్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ



**దొరవారిసత్రం,డిసంబరు1 ప్రభాతవార్త :** దొరవారిసత్రం మండల కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది ఎయిడ్స్ దినోత్సవము సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిని నిర్మాలిద్దాం భారతదేశాన్ని ఎయిడ్స్ రహితం చేద్దాం అంటు ప్రాధమిక ఆరోగ్య సిబ్బంది నినాదాలు పలికారు. వైద్యాధికారి చైతన్య సమీక్షంలో ఆరోగ్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వీరితోపాటు పలవురు వైద్య శిబ్బంది ఉన్నారు.

## రామ్‌కుమార్‌రెడ్డితోనే మా పయనం : ఏఎంసీ ఛైర్మన్



**బాలాయపల్లి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితోనే మా పయనమని ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, మండలాల నాయకులు తెలిపారు. బాలాయపల్లిలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి రామ్‌కుమార్‌రెడ్డిని నియమించారని, ఆయనతోనే పయనం సాగుతుందన్నారు. ఆయనతో కలిసి పార్టీ అభివృద్ధికి, మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎప్పటినుంచో నేదురుమల్లి కుటుంబంతో మాకు అనుబంధం ఉందన్నారు. ఆయనతో పాటు నాయకులు గోపీకృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

# ఆనం పోవడంతో నియోజకవర్గంకు పట్టిన శని పోయింది!



**వెంకటగిరి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నియోజకవర్గం నుంచి పార్టీ అధిష్టానం వెళ్లగొట్టడంతో నియోజకవర్గానికి పట్టిన శని పోయిందని ప్రజలు భావిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జగనన్న లేఅవుట్‌లో కూడా అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను కాంట్రాక్టర్ ఎందుకు ఆపారో అందరికీ తెలుసని చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు నక్సలైట్‌లని ఎమ్మెల్యే ఆనం ముద్ర వేస్తున్నట్లు విమర్శిం చారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ కంచుకోట అని, ఒకసారి తెలుగుదేశం బలంగా ఉందని, మరోసారి వయోభారం వలన ఆయన మాట్లాడుతున్నట్లు చెప్పారు. రాపూరు మండలంలో ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి, కొందరు పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ఉన్నందున అక్కడ కొందరు కన్వీనర్లు మార్చినట్లు చెప్పారు. నియో జకవర్గాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఫోన్ టాపింగ్‌కు, రికార్డింగ్‌కు ఆయనకు తేడా తెలియదని ప్రశ్నించారు. ఆనం ఫోన్ ఎవరూ ట్యాప్ చేయలేదని చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రంథా లయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, బాలాయపల్లి ఎంపీపీ భాస్క ర్‌రెడ్డి, నాయకులుశంకర్‌రెడ్డి,దశరథరామిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ స్థలాల దుకాణాల లీజుకు వేలం : డీఈ



**వెంకటగిరి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** జిల్లాలోని ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను వేలం ద్వారా అద్దెకిస్తున్నట్లు ఆ సంస్థ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.చెన్నకేశవరావు తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో వద్ద ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. జిల్లాలోని వెంకటగిరి, కోట, సత్తివేడు, పుత్తూరు ఆర్టీసీకి చెందిన స్థలాలను ఆన్‌లైన్ ద్వారా టెండర్లు నిర్వహించి లీజుకు ఇస్తామని తెలిపారు. పార్సిల్ సర్వీసు వంటి వాటికి అనుమతించని తెలిపారు. ఈ నెల10వతేదీటెండర్లునిర్వహిస్తామన్నారు. డిపో మేనేజర్ పెంచలయ్య, ఏఈ నవకోటి తదితరులు ఉన్నారు.

## వేగం కన్నా.. ప్రాణం మిన్న :ఎస్ఐ



**ఓజిలి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ డి. ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇవ్వరాదన్నారు.

## ఇద్దరు ఇన్స్‌పెక్టర్ల బదిలీలు



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లాలో ఇద్దరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు బదిలీ అయ్యారు. చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మద్దయ్యాచ్చారి చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే పుంగనూరు ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగిరెడ్డి చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు చిత్తూరు టుటౌన్ ఇన్‌ఛార్జి ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చిత్తూరు సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్ విధుల నుండి రిలీవ్ కావడంతో చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్‌గా శుక్రవారం మద్దయ్యాచ్చారి బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు ఇన్స్‌పెక్టర్‌గా ప్రస్తుతం ఎవరు నియమితులు కాలేదు.

## ప్లానింగ్ సెక్రటరీకి కలెక్టర్ స్వాగతం



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ జిఎస్‌ఆర్‌కెఆర్ విజయకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్ హరినారాయణన్ స్వాగతం పలికారు. అలాగే ప్లానింగ్ సెక్రటరీ జిఎస్‌ఆర్‌కెఆర్ విజయకుమార్‌కు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జిల్లా ప్రణాళిక అధికారి ఉమాదేవి, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుకలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

## పరిశుభ్రంగా ప్రజా మరుగుదొడ్లు : కమీషనర్



**చిత్తూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** నగర పరిధిలోని ప్రజా మరుగుదొడ్లను పరిశుభ్రంగా వుంచాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ శుక్రవారం నగరంలోని పిసిఆర్ సర్కిల్ ఆవరణలో వున్న ప్రజా మరుగుదొడ్లను అకస్మికంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లను మరింత శుభ్రంగా వుంచుకోవాలని అక్కడిని సిబ్బందిని ఆమె ఆదేశించారు. అనంతరం కమీషనర్ ఎంఎస్‌ఆర్ సర్కిల్, దర్గా సర్కిల్, కాజూరు, ఇరువారం ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అక్కడి నుండి కమీషనర్ తేనెబండ హౌసింగ్ కాలనీ చేసుకొని ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆమె వారితో పేర్కొన్నారు. అనంతరం ఆమె ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్, అనిమిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిన్నయ్య, హౌసింగ్ ఎఇ శ్రీధర్, అనిమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**కల్లూరు,ఫిబ్రవరి 3 ప్రబాతవార్త :** విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా మేనేజ్‌మెంట్ ఇన్మరేషన్ సిస్టం మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ గుణశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనికీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు నేడు పనులను తనిఖీచేశారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, రాజేంద్ర,వేణుగోపాల్,దొరస్వామి, రహ్మత్‌భాషా, మధుసూదన్‌రెడ్డి, సైదుల్లా పాల్గొన్నారు.

# కో ఆప్షన్ మెంబర్ ఎన్నిక ఏకగీవ్రంగా



**చిల్లకూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక ఏకగ్రీవంగా ఏరూరు గ్రామానికి చెందిన పఠాన్‌హాబీబ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చైతన్య కుమార్ ఆద్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. అనంతరం చైతన్య కుమార్ మాట్లాడుతు ఇటీవల కో ఆప్షన్ సభ్యునిగా ఎస్‌కె అమీర్ భాషాను నియమించడం జరిగివుంది. అయితే అతను మృతి చెందడంతో ఆయన స్దానంలో 12 మంది ఎంపిటిసిలు ఉండగా 9మంది ఎంపిటి సిలు ఏకగ్రీవంగా హాబీబ్‌ను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. అనంతరం ఎంపిపి తుపాకుల వెంకటరమణమ్మ, వైస్ ఎంపిపిలు వేమారెడ్డి కుమార్‌స్వామి రెడ్డి, పోలుబోయిన చెంగయ్య, జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్యలు ,కోప్షన్ మెంబర్‌ని ఘనంగా సన్మానించారు. ముందుగా జడ్‌పిసిఇఓ చిరంజీవి ఎంపిడిఓ కార్యాలయం చేరుకొని కో ఆప్షన్ ఎన్నిక ప్రశాంతంగ జరిగే విధంగా సూచనలు సలహాలు ఇచ్చారు.
ఎంపిడిఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ విష్ణు చిరంజీవి, ఏఓ శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

# పేదరికమే నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

-సి.మల్లవరంలో రూ.4.43 కోట్లతో అభివృద్ధి పనులు
-మల్లవరం గడప గడప కార్యక్రమంలో ఎంపిపి మోహిత్‌రెడ్డి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** పేదరిక నిర్మూళనే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సి.మల్లవరం గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సర్పంచ్ మొక్కల భారతి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పేదరికాన్ని రూపుమాపుటకు సి.యం.జగన్మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేదవాడు ఆర్థికంగా బలోపేతమైనట్లు తెలిపారు. సి.మల్లవరం



లో గడప గడపకు వెళ్ళి ప్రజా సంక్షేమ పథకాల గురించి ఆరా తీసారు. సి.మల్లవరం గ్రామ పంచాయతీలో రూ.4.43 కోట్ల రుపాయా లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో శాశ్వత భవనాలైన గ్రామ సచివాలయం, జగనన్న సమావేశ మందిరం, కర్మక్రియలషెడ్డు, ఆర్వోప్లాంట్‌నాడు-నేడు ద్వారా కార్పొరేట్ తరహాలో స్కూల్స్ నిర్మాణాలు, వైయస్సార్ డిజిటల్ లైబ్రరీ, యోగా మందిరాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైకాపా సీనియర్ నాయకులు మొక్కల తిమ్మారెడ్డి, ఉపసర్పంచ్ షెహనా భేగం, ఎంపిటిసి కృష్ణవేణి బాబ, ఖాదర్‌వల్లీ వాసు, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పాలు పంపిణీ

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



ఆయన ఒసాధువు.. ఆయన వస్తున్నారంటే అందరి చిన్నారుల కడుపునిండినట్లే.. ఆయన ఎవరో కాదు.. సాధుస్వయంభువుస్వామి. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి ఆకలిగా ఉన్న వారి ఆకలితీర్చుతూ, చిన్నారులకు పాలు పంపిణీచేస్తూ అందరికీ దగ్గరయ్యారు. ఇక గోమాతలను సంరక్షిస్తూ వాటి నుంచి వచ్చే పాలను సమీపంలోని భరద్వాజతీర్థం సమీపంలో ఉన్న గిరిజన కాలనీలో ఉంటున్న చిన్నారులకు అందించడం జరుగుతోంది. అంబలిస్వామిగా పేరుపొందిన ఆయన సాధుస్వయంభువుస్వామి శివరాత్రి పర్వదినాల్లో స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవంలో శంఖం పూరిస్తూ సాంబ్రాణి వేయడం మనకు కనిపిస్తుంది.

## ఎస్ఎల్ఐ రామచంద్రారెడ్డి సేవలు అభినందనీయం

**తవణంపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఎపిఎస్పీడీసీఎల్ సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ రామచంద్రారెడ్డి సేవలు అభినందనీయమని ట్రాన్స్‌కో చిత్తూరు ఈఈ హరి అన్నారు. బంగారుపాళ్యం మండలం కెజీ.సత్రంలో ట్రాన్స్‌కో సీనియర్ లైన్‌మేన్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రామచంద్రారెడ్డికి శుక్రవారం మండలంలోని ఐరాల క్రాస్ సమీపంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో అభినందన, సన్మాన కార్యక్రమం సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ హరి మాట్లాడుతూ రామచంద్రారెడ్డి తన సర్వీసులో ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ వినియోగదారులకు సేవలందించారని, ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో సన్మాన గ్రహీత రామచంద్రారెడ్డి దంపతులు, ట్రాన్స్‌కో ఏడీలు సుబ్రమణ్యం, శేషాద్రిరెడ్డి, ఏఈలు రాజేంద్రబాబు, చలపతి, బాలాజి, యూనియన్ నాయకులు అన్నాదొరై, శరవణ, రవిచంద్ర, యుగంధర్‌లతో పాటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## మూడు రోజుల్లోనే మాట నిలుపుకున్న నారా లోకేష్

- టెంకాయల వ్యాపారికి తోపుడు బండి అందజేత



**శాంతిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని మఠం పంచాయతీ గంగతిమ్మనపల్లికి చెందిన టెంకాయల వ్యాపారి నాగరాజుకు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తోపుడుబండిని అందించారు. ఇటీవల నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్న సమయంలో శాంతిపురంలో నాగరాజు నారా లోకేష్‌కు టెంకాయ అందించాడు. నాగరాజు చేతికి వేళ్ల లేక అతను కష్టపడుతున్న విధానం చూసిన నారా లోకేష్ అతనికి తోపుడు బండి అందిస్తానని హామీ ఇచ్చారు. మూడు రోజుల్లోనే నాగరాజుకు విజయవాడనుంచి తోపుడు బండి రాగా ముఖ్యనేతలు అతనికి తోపుడు బండిని అప్పగించారు. కార్యక్రమంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు కేశవులు, రమేష్, చంద్రకళ, జయపాల్, వెంకటరామప్ప పాల్గొన్నారు.

## రాళ్లబూదుగూరు వైస్ సర్పంచ్‌గా గాజుల

**శాంతిపురం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



మండలంలోని రాళ్లబూదుగూరు మేజర్ గ్రామ పంచాయతీ వైస్ సర్పంచ్‌గా గాజుల వెంకటరమణ ఎన్నికయ్యారు. శుక్రవారం ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. గతంలో వైస్ సర్పంచ్‌గా ఉన్న నిసార్ మండల కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నిక అయ్యారు. దీంతో 2021నవంబర్‌లో ఆ వార్డు ఎన్నిక జరగ్గా వార్డు మెంబరుగా వాజిద్ గెలిచారు. శుక్రవారం ఆర్ఓ అప్పోజి అధ్యక్షతన ఉప సర్పంచ్ ఎన్నిక జరగగా 8వ వార్డు సభ్యుడు గాజుల వెంకటరమణను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, జడ్పీటిసి శ్రీనివాసులు, మండల కన్వీనర్ దండపాణి, కో ఆప్షన్ సభ్యుడు నిసార్, సర్పంచ్ లక్ష్మి మురుగేష్, ఎంపిటిసి లక్ష్మమ్మ, కార్యదర్శి వనిత, వార్డుసభ్యులు, నేతలు నడింపల్లి చలపతి, కె. రమేష్, సూరిబాబు, జెఆర్ నాగరాజు, వెంకట్రామిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## రామకుప్పం ఎంపిపి..వైస్ ఎంపిపి ఎన్నిక వాయిదా

- హాజరు కాని ఎంపిటిసి సభ్యులు..

**రామకుప్పం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



రామకుప్పం మండల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు మరలా వాయిదా పడ్డాయి. రామకుప్పం ఎంపిపిగా శాంతకుమారి చంద్రారెడ్డి గతంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే అనారోగ్యంతో శాంతకుమారి మృతి చెందారు. దీంతో ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికకు అధికారులు ఇప్పటికే రెండు దఫాలు నోటిఫికేషన్ జారీ చేశారు. అప్పుడు కూడా ఎన్నికలు వాయిదా పడ్డాయి. శుక్రవారం ఎన్నిక జరగాల్సి ఉండగా ఎంపిటిసి సభ్యులు గైర్హాజరు అయ్యారని దీంతో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఆర్ఓ పురుషోత్తం, ఎంపిడిఓ రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణయ్య పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ నిండా మునగడం ఖాయం : ఎమ్మెల్యే

**వి.కోట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో నిండా మునగడం ఖాయమని ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ కామెడీ పీస్‌గా, ఐరన్ లెగ్‌గా మారారని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రలో ప్రజలు ఎవరైనా వచ్చారా అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఏం పీకానని ప్రశ్నించిన నారా లోకేష్ కుప్పంలో రోజూ పదివేలమంది బెంగళూరు వెళ్తుంటారని వారేం పీకారని ప్రశ్నించారు. కనీసం వార్డుసభ్యుడిగా గెలవని లోకేష్ తమపై విమర్శించడం దారుణమన్నారు. అక్రమంగా సంపాదించింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలోజడ్పీప్రత్యేకఆహ్వానితుడు గౌస్, ఎంపిపి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మసీదులలో పార్టీ ప్రచార కార్యక్రమాలు నిషేదం

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** పవిత్ర మసీదులలో పార్టీ ప్రచార కార్యక్రమాలు పూర్తిగా నిషేదమని, పార్టీలకు అతీతంగా నాయకులు వస్తే లోపలికి అనుమతించి దువా కార్యక్రమం మాత్రమే నిర్వహిస్తామని చిత్తూరు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మెన్ గఫార్‌ఖాన్ స్పష్టం చేసారు. శుక్రవారం నమాజ్‌వేళల్లో కొంతమంది టిడిపి కార్యకర్తలు లోకేష్‌యువగళం పాదయాత్రలకు మైనారిటీలు వచ్చి జయప్రదం చేయాలని కోరడం జరిగిందన్నారు. పార్టీ ప్రచారం వక్ఫ్‌బోర్డు నియమ నిబంధనలకు విరుద్దమని పేర్కొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

**గుడిపాల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మరకాలకుప్పం సచివాలయ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి ఎమ్మెల్యే వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ ఉపేంద్ర, మండల పార్టీ కన్వీనర్ జనార్థన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు రజనీకాంత్, ప్రసాద్‌రెడ్డి, జయకోడి, గణపతిలు, వైకాపా నాయకులు రవి, వెంకటేష్‌రెడ్డి, ప్రవీణ్, శింబు, సాయి, హరి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రీ-సర్వేను పరిశీలించిన ఆర్డీఓ సుజన

**పాలసముద్రం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీ బాలకృష్ణాపురం గ్రామ పరిధిలో జరుగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమంను శుక్రవారం నగరి ఆర్డీఓ సుజన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన రైతులకు సంబంధించి ఎదైనా నకిలీ పాసు పుస్తకాలు వుంటే పరిశీలించి తొలగించాలని తహసిల్దారు బాబును ఆదేశించారు. అలాగే మండలంలో ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆమె బాలకృష్ణాపురం గ్రామ సచివాలయంను ఆమె తనిఖీ చేసి రికార్డులను ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం తహసిల్దారు పాలసముద్రం తహసిల్దారు కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు బాబు, బాలకృష్ణాపురం పంచాయితీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ జ్ఞానప్రద వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు

**తిరుపతి (క్రీడా), ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఎస్వీ యూనివర్సిటీలో వెలసిన శ్రీ జ్ఞానప్రద వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు వాసుదేవ స్వామి, శ్రీనివాస స్వామి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ ఇన్చార్జ్ శ్రీనివాస్ పంపిణీ చేసారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవ స్వామి మాట్లాడుతూ జ్ఞాన ప్రద వెంకటేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్వామి వారిని దర్శించుకున్న బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి, ప్రొ. భానుదయ రెడ్డి, కొట్టే సుబ్రమణ్యం రెడ్డి, రమేష్ బాబు స్వామి వారిని దర్శించుకుంటే అన్ని శుభాలే జరుగుతాయని ప్రతి ఒక్కరు స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఇంకా స్వామి వారిని దర్శించుకున్న వారిలో విజయ్ కుమార్ రెడ్డి, ప్రవచనకర్త గరికపాటి రమేష్ బాబు, శ్రీనివాసులు, సాయి తదితరులు ఉన్నారు.

## నేడు పిచ్చాటూరులో గృహ సారధులకు శిక్షణ



**పిచ్చాటూరు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో పిచ్చాటూరు మండల సచివాలయ మండల, గ్రామ కన్వీనర్లుకు, వాలంటీర్లకు శనివారం గృహసారధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ కేటి హరిశ్చంద్ర రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమీపంలో జరగనున్న ఈ శిక్షణ తరగతులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొని దిశ నిర్దేశం చేస్తారన్నారు. ఈ శిక్షణకు మండలంలోని సచివాలయ మండల, గ్రామ కన్వీనర్ల, వాలంటీర్ల, గృహ సారధులు వంద శాతం హాజరుకావాలని హరిశ్చంద్ర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు



**రేణిగుంట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** రేణిగుంట సీఆర్ఎస్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. యూనియన్, సంఘ్ పోటా పోటీగా గెలుపొందగా ఇండిపెండెంట్ ప్యానెల్ పత్తా లేకుండా పోయింది. ఎన్నికల్లో కార్మికులు క్రాస్ ఓటింగ్ చేశారు. దీంతో ఫలితాలు ఎవరికి ఆశాజనకంగా లేవు. ప్రధాన పదవులు రెండింటిని మజ్దూర్ యూనియన్ హస్తగతం చేసుకోగా మరో పదవిని సంఘ్ దక్కించుకుంది. కార్యవర్గ సభ్యులుగా నలుగురు సంఘ్ నుంచి గెలుపొందగా రెండింటితో మజ్దూర్‌యూనియన్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శిగా మజ్దూర్ యూనియన్ నుంచి హెన్రీ పాల్, కోశాధికారిగా మునికుమార్, ఉప కార్యదర్శిగా సంఘ్‌కుచెందిన దేవలం రాజేష్ గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా మజ్దూర్ యూనియన్‌కు చెందిన హరీష్‌కుమార్, మార్టిన్ లూథర్, సంఘ్ అభ్యర్థులు ఓబులేషు, వాసు, బసప్ప, రాబర్ట్ రాజ్ గెలిచారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించిన పోలింగ్ అధికారులు దాస్య నాయక్, అరుణ్ కుమార్‌లను మజ్దూర్ యూనియన్, సంఘ్ నాయకులు అభినందించారు. గెలుపొందిన అభ్యర్థులను ప్రశంసించారు.

## లోకేష్‌కి మద్దతు తెలిపిన గాలి భానుపక్రాష్



**నగరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు సంఘీభావంగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ శుక్రవారం బంగారుపాళెం పాదయాత్రలో ఉన్న లోకేష్‌ను కలసి మద్దతు తెలిపారు.

## వైభవంగా ముగిసిన కావమ్మ మారయ్య తిరుణాళ్లు

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కావమ్మ మారయ్యతిరుణాళ్లు శుక్రవారంతో ముగిసింది. భక్తులు స్వామివారికి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## నెల్లూరు మురళీకృష్ణ హోటల్‌చే రూ.8లక్షల వంట పాత్రలు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి శుక్రవారం నెల్లూరుకు చెందిన హోటల్ మురళీకృష్ణ అధినేత సుబ్బారావు సుమారు రూ.8లక్షల విలువ చేసే వంట పాత్రలను చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందించారు. మురళీకృష్ణ హోటల్ యజమాని ప్రతి ఏడాది శివరాత్రి సందర్బంగా దేవస్థానంకు వంట పాత్రలను అందించారు. ఈ సందర్భంగా సుబ్బరావు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాల యానికి అవసరమైన ఏ రకమైన వంట పాత్రలైనా అందిస్తామన్నారు. ప్రతి ఏడాది శివరాత్రి నుంచి స్వామి అమ్మవార్లకు కొత్త పాత్రలు అందించటం ఆనవాయితిగా వస్తుందని రాబోవు రోజుల్లో కూడా అందిస్తామని సుబ్బారావు వివరించారు. ఈ సందర్భం గా వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు, స్వామిఅ మ్మవార్ల తతీర్థ ప్రసాదాలు అందించారు. చైర్మెన్ అంజూరు తారక శ్రీసివారులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ప్రసాదాల ఇన్‌చార్జి మునిరెడ్డి, రాంబాబు, నూకరాజు, సుదర్శన రెడ్డి పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన ప్రసాదానికి విరాళం:

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాదు వాస్తవ్యులు విరాళం అందించారు. హైద రాబాదుకు చెందిన నళిని మోహన్ కుటుంబసభ్యులతో కలసి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగాఆయనకు ధర్మ కర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక దర్శనం చేయించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఆలయంలో అమలు జరుగుతున్న పథకాలను వివరించారు. విరాళంఅందించినవారికిస్వామి అమ్మ వార్లశేషవస్త్రాలనుఅందించారు. ఉద్యోగికడపసుదర్శనంరెడ్డిబ్యాంక్ కౌంటర్ సిబ్బంది చరణ్‌లు పాల్గొన్నారు

## మోదుగుల పాళెంలో వంతెన నిర్మాణానికి భూమి పూజ



**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని మోదుగుల పాలెం స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమాల్ని చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా మోదుగుల పాళెం గ్రామానికి ఏర్పేడు నుంచి వెళ్ళటానికి స్వర్ణముఖి నదిలో నీరున్నపుడు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా వర్షాకాలం ఈ గ్రామంతో ప్రజలు, అధికారులకు సంబంధాలు తెగిపోతున్నాయి. గతంలో ఓ సారి సినీనటులు, మోహన్‌బాబు రాజ్యసభ సభ్యుని హోదా లో వంతెనను నిర్మించారు., ఈ వంతెన శిధిలావ స్థకు చేరుకుంది, ఈ ఏడాది వర్షాం కాలం స్వర్ణముఖి నదికి వరద రావటంతో కొన్ని రోజులు గ్రామస్థులు ఎంతో ఇబ్బందిపడ్డారు. ఈ సమస్యను గుర్తించిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దృష్టికి అధికార పార్టీ నాయకులు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డితీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరించటంలో ముందుండే శాసనసభ్యుడు సూచనలతో శుక్రవారం నూతన వంతెన నిర్మాణానికి భూమి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కావేరి తిర మల్య, ఎంపిపిగీత, వైస్‌ఎంపిపిశ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌జయరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువగళం పర్యటనపై నాయకులు పరిశీలన

-16న తొట్టంబేడు మండలంలోకి..



**తొట్టంబేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి, యువనాయకుడు నారాలోకేష్ నిర్వహిస్తున్న 'యువగళం' పాదయాత్ర ఈనెల 16వ తేదీన తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీలో లక్ష్మీపురం వద్ద నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి అడుగుపెట్ట నుంది. ఈమేరకు శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు తొట్టంబేడు మండలం మరియు శ్రీకాళహస్తి పట్టణంలోని రూట్‌మ్యాప్‌ని పరిశీలించాలని రాష్ట్ర కార్యదర్శి మరియు నియోజకవర్గ పరిశీలకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు మరియు తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు, పట్టణ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డిలతో కలసి రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. ఈనెల 15వతేదీన కెవిబిపురం మండలం బైరాజుకండ్రిగ మండలంలోని తొట్టంబేడు మండల భూముల్లో బస ఏర్పాటు చేసేవిధంగా చర్యలుతీసుకుంటున్నారు. దీంతో ఇక్కడ భూములను పరిశీలించారు. ఇక్కడ రాత్రి బసచేసిన అనంతరం ఈనెల 16వ తేదీన యువగళం యాత్ర లక్ష్మీపురం వద్ద నుంచి కొనసాగుతుంది. 17వతేదీ సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని పాదయాత్ర ప్రవేశిస్తుంది. 17,18వతేదీల్లో రెండు రోజుల పాటు పాదయాత్ర శ్రీకాళహస్తిలో ప్రశేసిస్తుంది. 18వతేదీన శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకోనున్నట్లు సమాచారం. అనంతరం హౌసింగ్‌బోర్డు వద్ద ఉన్న ఓ ప్రైవేటు స్థలంలో బహిరంగసభను ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నారు. అనంతరం శ్రీకాళహస్తి మండలం తొండమనాడు నుంచి పాదయాత్ర కొనసాగుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏర్పాట్లును పర్యవేక్షించిన వారిలో బాబురెడ్డి, వేణురెడ్డి, వెంకటయ్య, ప్రతాప్, ప్రవీణ్, బాలాజీరెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, శ్రీనివాసులు, మరియు లోకేష్‌బాబు టీం ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కియాకు కార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ప్రముఖ కార్ల సంస్థ కియాకు ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో పాటు గ్రీన్ కార్ 2023 అవార్డు లభించినట్లు ఆ సంస్థ సిఈఓ కియా ఇండియా తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ దేశంలో అతివేగంగా పెరుగుతున్న కార్ల తయారీలో కియా ఇండియా ఒకటన్నారు. 2023లో ఒకేసారి రెండు అవార్డులు కైవసం చేసుకోవడం సంతోషకర మన్నారు. ఏజెఏఐ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా ఐకోటీ అవార్డులు అందిస్తున్నాయని, ఇది దేశంలో అత్యంత గొప్ప అవార్డుగా పేరు గడించిందన్నారు. దేశంలో ఆటోమోటివ్ పరిశ్రమలకు ఆస్కార్స్‌గా సూచింపబడతాయన్నారు. అలాంటి అవార్డు కియా సంస్థ అందుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

**నారాయణవనం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అధిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## 6నుంచి మరగదవల్లీ సమేత అగస్త్రీశ్వరుని మహాకుంభాషేకం

**నారాయణవనం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని సముదాయం గ్రామ పరిధిలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగవల్లీ సమేత అగస్త్రీశ్వరుని అష్టబంధనం, మహా కుంభాషేకం ఈనెల 6 నుంచి 10వతేది వరకు జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు.

## క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

**నగరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**





క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేకేసీ హోమియోపతి కళాశాల ఆధ్వర్యంలో నగరి పట్టణంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐ శ్రీనివాసంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌రోగం కంటే ఆ రోగం కల్పించే భయమే మనిషిని కృంగదీస్తుందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన, సరైన చికిత్స కోసమే ప్రపంచ క్యాన్సర్‌డే జరుపుకుంటున్నారన్నారు. ఈ ర్యాలీలో కేకేసీ కళాశాల వైస్ చైర్మన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ డా. శరవణన్, ప్రొఫెసర్ నాగరాజు, హోమియోపతి కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుబంధ ఆలయాల్లో బాలాలయ పూజలు

**తొట్టంబేడు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వెలసిన అగస్తీ శ్వరస్వామి ఆలయంలో బాలాలయ స్థాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ దర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుశ్రీనివాసులు, ఆలయ సభ్యులు హజరయ్యారు. ఉదయం నుంచి ఆలయంలో బాలాలయ స్థాపన విశేషపూజలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలును శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ ఛైర్మన్, సభ్యులు, ప్రత్యేకాహ్వానితులుతో పాటు గ్రామస్తులు పవిత్రజలాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం శ్రీకాళహస్తిలోని భక్తకన్నప్ప కొండపై నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బాలాలయ స్థాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ఎసి మల్లికార్జునరావు, మరియు పాలకమండలి సభ్యులు, పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితులు మరియు శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు, పొరోహితులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా జయంత్ బాబు

**వడమాలపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



మండల ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా పూడి గ్రామానికి చెందిన జయంత్‌బాబును నియమించినట్లు జిల్లా సెక్రటరీ మునిబాబు ప్రకటించారు. శుక్రవారం వడమాలపేటలో మునిబాబు అధ్యక్షతన అంబేడ్కర్ యువజన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా లోకనాథం, జనరల్ సెక్రటరీగా దేవరాజులు, కోశాధికారిగా గణేష్, కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి డాక్టర్ డేవిడ్, కాకి వెంకటేష్, నాగరాజు, మస్తాన్, రాజశేఖర్, బాల, వెంకటస్వామి, మునిశేఖర్, ప్రభాకర్, ఈశ్వర్, శీను, జానకి రామయ్య, చెన్నయ్య, మనోహర్, చెంగల్రాయులు, దాము, మోహన్, క్రాంతి, నితీష్, సాయికృష్ణ, సాంబ తదితరులు పాల్గొన్నారు.

## వలస పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ

**చంద్రగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



వలస పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై పంచాయతీ కార్యదర్శి అనూరాధ విద్యా సామగ్రిని అందించినట్లు ఎంఈఓ శ్రీరం లలితకుమారి తెలిపారు. మహారాష్ట్ర, రాజస్థాన్ నుండి వలస వచ్చిన కుటుంబాల పిల్లల కోసం రాయలపురం పంచాయతీ, వెంకటంపేటలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌టిసి)ను శుక్రవారం ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయలపురం పంచాయతీ కార్యదర్శి అనూరాధ వ్యక్తిగతంగా 40 మంది విద్యార్థులకు పలకలు, బలపాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, వైసిపి దక్షిణ మండల అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, అగరాల సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, పిచ్చినాయుడుపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీ, పసల నాగరాజ, తల్లిదండ్రులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా ప్రశంసకులకు ఘన సన్మానం

**చంద్రగిరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



విధినిర్వహణలో ఉత్తమ సేవలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా "ప్రశంస"లు అందుకున్న ప్రశంసకులను శుక్రవారం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ శిరీషా, ఎంపిడిఓ రమేష్‌బాబు, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి దంపతులకు, పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రమణకుమార్, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ యుగంధర్, విఆర్ఓ సఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పోలీస్ కానిస్టేబుల్స్ గోపి, రవిలతో పాటు ఎంపిపి మావిళిరెడ్డి హేమేంద్రకుమార్ రెడ్డిని దుశ్శాలువ, పూలమాలలతో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రశంస తమలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. తమ పట్ల ప్రేమాభిమానాలతో సన్మానించిన ఉపాధ్యాయ సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్‌ము తద్దికుప్పంరూపరామమూర్తి, ఎంపిటిసిలుబుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, అజీజా నుస్రత్ బహార్, పాల్గొన్నారు.

## నేటి నుండి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు

**తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



ఫిబ్రవరి 4(నేడు శనివారం) ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ఆబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ (ఏపిఓజి)మరియు గవర్నమెంట్ మెటర్నటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన మరియు స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సొసైటీ అధ్యక్షురాలు డా॥భారతి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం యొక్క థీమ్ 'సంరక్షణ అంతరాన్ని' ఆపండి అనే నేపథ్యంలో జరుపుకుంటున్నామన్నారు. ఈ ప్రచారం ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ సంరక్షణ అసమానతలను గుర్తించడం, అలాగే నిర్ధారించడం కోసం అంకితం చేయబడిందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో క్యాన్సర్‌పై ఉన్న అపోహలను తొలగించి, వాస్తవాలను తెలియచేయడమన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించి నగరంలోని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు క్యాన్సర్‌అవగాహనసదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలోఏపిఓజిసొసైటీకార్యదర్శి డా॥సునీత, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥పారథసారథి, డా॥మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## పథకాల పంపిణీలో బంగారు తల్లులు వలంటీర్లు : మంత్రి రోజా

**నగరి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** జగనన్న సంక్షేమ పథకాల పంపిణీలో బంగారు తల్లులుగా వలంటీర్లు నిలుస్తున్నారని, వారికి మద్దతుగా మరో ఇద్దరితో గృహ సారథులు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు మంత్రి రోజా తెలిపారు.



నగరిలోని మంత్రి కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉండడం మన అదృష్టమని తెలిపారు. రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలతో సంక్షేమపథకాలు అమలు చేస్తున్నా, ఎలాంటి పబ్లిసిటీకి ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిపారు. తెలుగుదేశం నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తిప్పికొట్టాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా అందరూ సంతోషంగా స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. సమావేశంలో విజయపురం మండలం ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, రాష్ట్ర బోర్డు డైరెక్టర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పాటు వలంటీర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతదేశ చరిత్రలో లేని మన రాష్ట్ర అభివృద్ధి : ఎమ్మెల్యే

కోట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త : కోటమండలం ఊనుగుంటపాళెం గ్రామ పంచాయతీలోని గ్రామం లో శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా లబ్ధిదారుడికే చేరేటట్లు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిని ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా సంక్షేమ పథకాలే వైసీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తా యని చెప్పారు. అమ్మఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్ మెంట్, ఉచిత విద్యుత్, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ తదితర ఎన్నో పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. గతంలో చంద్రబాబు ఎన్నో మోస పూరిత మాటలు చెప్పారని అందు వలన 2019 ఎన్నికల్లో ఆయనను ప్రజలు ఇంటికి పంపారని గుర్తు చేశారు. గతంలో గూడూరు శాసన సభ్యులు తో పాటు 23



మంది శాసన సభ్యులు చంద్రబాబుకు అమ్ముడిపోయ్యారని విమర్శించారు. అమ్మడి పోయిన శాసన సభ్యులకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంటనియోజకవర్గ మైనార్టీ నాయకులు షెక్. మోబిన్ భాష మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలును మన ముఖ్యమంత్రి వైఎస్. జగన్మో హన్ రెడ్డి అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి నేరుగా ఎవరో అందచేశారో ఒక్క సారి ప్రజలు బేరిజు వేసుకొవాలని కోరారు. అర్హతే ప్రమాణి కంగా తీసుకుని కుల మతాలకు, పార్టీలకు అతీతంగా జగనన్న పథ కాలను అందచేస్తున్నారని మోబిన్ బాష గుర్తు చేశారు. మన శాసన సభ్యులు మనస్సు న్న మంచివారని, అందరికి అందుబాటులో ఉంటూ సమస్య లను పరిష్కరిస్తారని తెలిపారు. ఇలాంటి శాసన సభ్యులు మళ్లీ మనం గెలుపించుకోవాలిన్సన అవసరం ఏంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో , ఎన్‌డిసిబ్యాంక్ డైరెక్టర్ నరమాల వెంకటరమ ణయ్య, తహిశీల్దార్ పద్మవతి, ఎంపిడిఓ మారెళ్ల భవాని, ఆర్‌డబ్లుఎస్ ఎఇ హెమంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, రాఘవరాజు, ఉల యకాయలప్రసాద్, గురుస్వామి, విగ్రహాల రఘురామయ్య, సచివాల యు సిబ్బంది, వాలింటర్లు, తదితరులు పాల్గొన్నారు.

**డిఆర్ వర్గం దూరం:** గడప గడపకు కార్యక్రమంకు డిఆర్ వర్గం దూరంగా ఉండి పోయింది. గత మూడు ళ్ల నుంచి శాసన సభ్యులు వర ప్రసాద్‌రావుతో ధనంజయరెడ్డి అనుచరులు ఎమ్మెల్యే కార్యక్ర మాలకుదూరంగా ఉంటూ వస్తున్నారు. ఈక్రమంలోనే ఈ కార్యక్రమ యానికి కూడా ఆ వర్గం నాయకులు ఎవరు హజరు కాలేదు.

## నేడు ప్రపంచ క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

**తిరుపతినగరం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా నేడు డిబిఆర్ మరియు ఎస్‌కె ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలో ఐహెచ్ఎ కాళహస్తి భాగస్వామ్యంతో మెగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డిబిఆర్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మధుకృష్ణరెడ్డి తెలిపారు. క్యాన్సర్‌దినోత్సవ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30గంలకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు.

## బంధాలు,బంధుత్వాలు మరిస్తే స్వర్గానికి ఎలా వెళతారు!



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** నేడు ముస్లిం సమాజంలోని యువతీ,యువకులు పరమత మోజులో మునిగి పోతున్నారని మన మత పెద్దలు ఆచరించిన విధానాలు మరచి పోతున్నారు. మసీదులకు స్వస్తి చెప్పి విలాసాల్లో తుల తూగుతున్నారని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ అన్నారు. శుక్ర వారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన ప్రసంగిస్తూ మన ప్రవక్తలు బంధాలు, బంధుత్వాలకు ఎంతో విలువ ఇచ్చావారన్నారు. కానీ నేడు సమాజంలో పరిస్థితులు మారాయన్నారు. కుటుంబాలు, బంధుత్వాల మధ్య సత్సంబంధాలు కొరవడ్డాయన్నారు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. నేడు యువత మసీదు దారిని మరచి విలాసల్లో మునిగి తెలుతున్నారన్నారు. నమాజువేళల్లో వీధుల్లో సంచరిస్తారు కానీ నమాజుకు రావటం లేదన్నారు. మన కట్టుబొట్టు విధానం మారాలన్నారు. మనం ఆచరించాల్సిన చిన్న చిన్న అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవటం లేదన్నారు. అందరిని నడిపించే అల్లాహ్‌ను విస్మరించి, ప్రవక్త ఆచరించిన విధానాలను అచరించక ఎలా స్వర్గానికి వెళతామని ప్రశ్నించారు. మనకు సకల సంపదలు ఒసగిన అల్లాహ్‌ను సదా స్మరించాలని ఆతని ధ్యాసలో గడపాలన్నారు. మన సంప్రదాయాలను తెలుసుకోవటానికి ప్రతి ఒక్కరు విద్యావం తులు కావాలని వివరించారు. అక్షరం లేనందువల్లనే మన సంప్రదాయాలను ఆచరించలేక పోతున్నామన్నారు

## రామలింగాపురంలో పాడి రైతులకు ప్రోత్సహాకాలు



**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం గ్రామంలో శుక్రవారం శ్రీకాళహస్తి కోఆపరేటివ్ పాలసరఫరా కేంద్రం సారథ్యంలో పాడిరైతులకు ప్రోత్సహాకాలను అందించారు. గతంలో పాల సేకరణ కొన్ని ప్రాంతాలకే పరిమితం కాగా ప్రస్తుతం తాము ఎక్కడ ఎపాల ఉత్పత్తి ఉందో అక్కడ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ప్రోత్సహించుటకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సూచనలతో చర్యలు తీసుకుంటున్నామని చైర్మెన్‌మునగాల మధుసూధనరావు (చిట్టి) అన్నారు. పాలసరఫరా కేంద్రంలో రైతులచే సరఫర చేసిన పాల విక్రయాల్లో వచ్చిన ఆదాయాలను రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా లాభాల దిశగా అందిస్తున్నామన్నారు. ఈ నేపధ్యంలో రామాలింగాపురంలో పాడి రైతులకు ప్రోత్సహాకాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్లు దామోదర్‌రెడ్డి, రమణి పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ లేకుండా కార్యక్రమాలా!

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు ఈ ఏడాది సరికొత్త పుంతళ్ళు తొక్కుతోంది. సాధారణంగాశివరాత్రి అంటే గత మూడేళ్ళగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి తన సొంతింటి కార్యక్రమం కన్నా మిన్నగా పర్యవేక్షించే వారు. అయితే ఈ సారి ఏమైందో ఏమో కాని ఆయన లేని సమయాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి అంటే దేశ నలుమూలల నుంచి వచ్చే అతిధులు,సామాన్య భక్తులను ఆకట్టుకునే విధంగా గత రెండు సంవత్సరాల పాటు నిర్వహించటానికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అధికారులకు సహకరించారు. అయితే ఈ ఏడాది ఎందుకో కార్యక్రమాలకు శాసనసభ్యుడు హాజరు కాకుండానే జరుగుతున్నాయి. ఈ ఏడాది ఒక్క సమావేశం మొక్కుబడిగా ఎంఎల్ఏ హాజరు కాగా నిర్వహించారు. పలు సూచనలు చేసారు. అయితే ఈ ఏడాది' ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ' హడావిడిగా అధికారులు నిర్వహించారు. ఈ ఆవిష్కరణలో చైర్మెన్ కకూడా అందుబాటులో లేదు. ఇక కలెక్టర్ సమావేశం రెండు రోజులు వాయిదా పడి బుధవారం జరిగింది. ఈ సమావేశానికి కూడా ఎంఎల్ఏ బియ్యపు మదుసూధనరెడ్డి హాజరు కాలేదు. ఒక వేళ ఎంఎల్ఏ అందుబాటులో లేనపుడు అధికారులు సమావేశం ఆయన అందుబాటులో ఉన్నపుడు నిర్వహించవచ్చు కదా? అని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

## స్థలం చూపారు....ప్లాటింగ్ మరిచారు!

-ఈ ఏడాదిలోనైనా ఇంటి నిర్మాణం అడుగులుపడేనా!? -టిటిడి ఉద్యోగుల ఎదురుచూపు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల/తిరుపతి:** ధార్మిక సంస్థ టిటిడిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల నివాసాల కోసం ప్రభుత్వం నిబంధనల మేరకు స్థలాలు చూపినా, ఆచోట ప్లాటింగ్ చేసి కేటా యించడం మరిచారనే వాదనలు టిటిడిలో ఉద్యోగుల్లో వినబడుతున్నాయి. ఉద్యోగులకు ఇళ్ళస్థలాల కోసం తిరుపతి జిల్లా పరిధిలోని వడమాలపేట మండలం అరణ్యంపాదిరేడు గ్రామ శివార్లలోని సుమారు 300 ఎకరాలు భూమిని గత ఏడాదే టిటిడికి ప్రభుత్వం కేటాయించింది. దీనికి సంబంధించి సుమారు 62కోట్ల రూపాయలు నిధులను కూడా చెక్కురూపంలో టిటిడి పాలకమండలి ,టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు తిరుపతి జిల్లాకలెక్టర్‌కు అంద జేశారు. ఆ తరువాత ఈ స్థలం పక్కనే మరో 140 ఎకరాల స్థలం కూడా టిటిడికి కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖత చూపింది. ఈ స్థలాలను కేటాయించడంలో ఎదురైన చిన్న ఇబ్బందులను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే, తుడ చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు ఉద్యోగుల ఇళ్ళస్థలాలకు కేటాయించిన భూమిని అప్పగించకపోవడంతో, అవసరమైన పనులు కూడా ముందుకుసాగలేదు. ప్రభుత్వం నుంచి స్థలం పూర్తిగా టిటిడికి స్వాధీనం పరిచినా తరువాత అభివృద్ధి నత్తనడకన ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం టిటిడికి కేటాయించిన 300 ఎకరాల భూమిలో ఒక్కో ఉద్యోగికి 40 అంకణాలు కేటాయించినా 4,500మంది వరకు ఉద్యోగులకు ప్లాటింగ్ గుర్తించే వీలుకలుగుతుంది. అయితే దాదాపు ఏడాది కావస్తున్నా తమ ఇళ్ళస్థలాల కేటాయింపు విషయంపై ఆలస్యమవుతుండటంతో టిటిడి ఉద్యోగులు అంతర్మథనం చెందుతున్నారు. టిటిడిలో తిరుమల, తిరుపతితో పాటు స్థానికంగా పలు ఆలయాల్లో, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మూడు దశాబ్దాలుగా ఇళ్ళస్థలాల కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు. గతంలో పదేళ్ళక్రిందట ఉద్యోగులకు ఇళ్ళస్థలాల కోసం ఎస్వీపూర్‌హోమ్, ఎస్వీడైరీఫామ్, బ్రాహ్మణపట్టు, ఎస్‌జిఎస్ కళాశాలవద్ద, వినాయకనగర్ క్వార్టర్స్‌ప్రాంతాల్లో అపార్టుమెంట్‌లనిర్మాణానికి 3,500మంది ఉద్యోగులకు అవకాశం కల్పించేలా కార్యాచరణ రూపొందించారు. కానీ ఈ స్థలాలపై కొందరు సుప్రీంకోర్టువరకు వెళ్ళడంతో ఎక్కడివేసిన గొంగడిఅక్కడే ఉంది. ఇంత జరిగినా ఈ స్థలాలు కేటాయింపుపై కూడా టిటిడి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. మొత్తంమీద స్థలాలు చదును చేసి ప్లాటింగ్ కేటాయిస్తే తప్ప ఈఏడాదిలోఅయినా సొంతింటి కల సాకారమవుతుందో లేదోనసే నిరాశతో ఉద్యోగులు మథనపడుతున్నారు.

## రామకృష్ణతీర్థ ముక్కోటి రోజున..భక్తులకు సకల సదుపాయాలు



**తిరుమల, ఫిబ్రవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వేలకోట్ల తీర్థాలలో ఒకటైన రామకృష్ణతీర్థ ముక్కోటి ఆదివారం జరగనుందని, ఈ తీర్థంలో పుణ్యస్నానాలకొచ్చే భక్తులకు చక్కగా సదుపాయాలు కల్పించాలని తిరుమల అదనపు ఎస్పీ మునిరా మయ్య సూచించారు. తీర్థానికి ఆదివారం విచ్చేసే భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ సమస్య దృష్ట్యా ఆర్టీసి బస్సులను మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. రామకృష్ణతీర్థానికి వెళ్ళే భక్తులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ, పైప్‌లైన్‌ద్వారా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో విజిఓలు బాలిరెడ్డి, గిరిధర్, డిఎఫ్ఓ శ్రీనివాస్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## కళాత్మక చిత్ర జీవనదాత విశ్వనాథ్



**తిరుపతి, ఫిబ్రవరి3ప్రభాతవార్త:** కళాఖండాలుగా తెలుగువారి హృద యాల లో నిలిచిన సినిమాలకు జీవంపోసి ,జనరంజకం చేసిన సినీదర్శకుడు కె.విశ్వనాథ్ అని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండా ల గోపీనాథరెడ్డి కొనియాడారు. మన సంస్కృతికి అద్దం పట్టే సంగీత సౌభాగ్యానికి జీవనదాతగా వాసికెక్కా డన్నారు. శంకరాభరణం, సాగరసంగమం, స్వాతిముత్యం, సప్తపది ,స్వర్ణకమలం ఇలాంటి కళాత్మక చిత్ర సారథి నటరాజుపాదాల చెంత తన జీవనరాగాన్ని వదలి వారిలో ఐక్యమొందారని గోపీనాథరెడ్డి తెలిపారు. ఆయన ఎప్పటికీ తెలుగుప్రజల గుండెల్లో చిరస్మరణీయులని కొనియాడారు. దర్శకుడు విశ్వనాథ్ మృతితో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రాయలసీయ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,సభ్యులు కెవిన్ రాజా, ఎన్‌వి రామకృష్ణయ్య, టి.సుబ్రమ ణ్యంరెడ్డి, ఎ.రాజశేఖర్‌రెడ్డి, కె.సుబ్రమణ్యంరెడ్డి, ఈశ్వరయ్య, దిలీప్, చంద్రారెడ్డి కళాకారులు పాల్గొన్నారు.

## మృతిచెందిన కుటుంబాలకు రూ.25లక్షలు పరిహారం చెల్లించాలి



**తిరుపతినగరం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** సింథటిక్ రసాయనాల ట్యాంక్ మృతిచెందిన వెంకటేష్, నరేంద్ర కుటుంబాలకు రూ.25లక్షలు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి రుయా ఆస్పత్రిలో మార్చురీ వద్ద సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో న్యాయం కోసం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ మాట్లాడుతూ తిరుపతిజిల్లా రేణిగుంట మండలం గాజులమండ్యం పారిశ్రామిక వాడ ప్రాంతంలో శ్రీరాధాబయోటెక్ ఫ్యాక్టరీలో గత కొన్ని నెలలుగా వృదాగా ఉన్న సింథటిక్ రసాయనాల ట్యాంకులోకి ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండా అందుకు అవసరమైన కార్మికులకు యాజమాన్యం సహకరించకుండా ట్యాంకులోకి దించి మృతికి కారణమైన ట్యాంకులోకి దించి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన నరేంద్ర, వెంకటేష్ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉందని వారు డిమాండ్ చేశారు. ఆక్సిజన్ లేకుండా పూర్తి స్థాయిలో కెమికల్ నిండిన ట్యాంకులోకి దింపడం ప్యాక్టరీ యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యం వల్ల ఇది జరిగిందని స్పష్టమవుతోందన్నారు. అందుకోసం ఇది సాధారణ మృతి కాదని దీనిని హత్యగా పరిగణలోకి తీసుకుని ఫ్యాక్టరీయజమానిపై హత్యకేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు ఎప్పుడూజరగలేదని మళ్ళీ పునరావృత్తం కాకుండా ఫ్యాక్టరీ యాజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌తక్షణమే స్పందించి పరిహారం అందించడంతో పాటు మృతిచెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.కుమార్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నంపెంచలయ్య, సిపిఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నదియా, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఏపి బాల, వైఎస్.మణి, మహేంద్ర, మోహన్‌రెడ్డి, కార్తీక్, నాగరాజు, సూరి, అలేఖ్య, మరియు మృతుల కుటుంబాల బంధువులు, సన్నిహితులు పాల్గొన్నారు

## వృద్ధులకు, మహిళలకు పోలీసు స్టేషన్ అండగా నిలవాలి

**భాకరాపేట, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** వృద్ధులకు మహిళలకు పోలీసు స్టేషన్‌లు అండగా నిలవాలని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన భాకరపేట పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణతో విదులు నిర్వహించి ఫిర్యాదు దారులతో ఆత్మీయంగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. భాకరాపేట కనుమ రహదారిపై నిరంతర పర్యవేక్షణ అవసరం అన్నారు. పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి బాదితులకు సరైనన్యాయం చేయాలన్నారు. పైబర నేరాలపట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతిన పూర్తి చేయాలని చెప్పారు. మహిళా సంబందిత నేరాల పట్ల వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. తిరుపతి మదనపల్లె జాతీయ రహదారి శేషాచల కనుమ మార్గం భాకరాపేటగుండా ఉన్నందున నిరంతర వాహనాల తనిఖీలను నిర్వహించి ఎర్రచందనం అక్రమ రవానాన్ని అరికట్టాలన్నారు. స్టేషన్ పరిదిలో ఎక్కువ భాగం కనుమ రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రమాదకరమైన మలుపులు రోడ్‌క్రాసింగ్‌లను గురించి అక్కడ సూచిక బోర్డులను స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళా సంరక్షణ కార్యదర్శులతోఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో గృహనిర్బంద మహిళ సంబందిత విసయాలను బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీచిర్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ మరియు ఫోక్సో చట్టం గురించి సంబంధిత పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలుఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐలుచంద్రశేఖర్‌పిళ్లె, డీసీఆర్‌బీ తులసీరాం, బాకరాపేట ఎస్ఐ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి సుదర్శనం-లింగోద్భవానికి ప్రత్యేక ఏర్పాట్లు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఈనెల 13 నుంచి ప్రారంభం అయ్యే భోళాశంకరుని బ్రహ్మోత్సవాల్లో సాధారణ భక్తులకు సుదర్శనం, లింగోద్భవ అభిషేకానికి చక్కటి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు వారి సహచర సభ్యులు వివరించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ పరిపాలన భవనంలోని సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఏర్పాట్లకు సంబందించి వివరించారు. వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లును వివరిస్తూ లోటుపాట్లను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈఉత్సవాలను విజయవంతం చేయడానికి ఏర్పాట్లుతాము చేస్తున్నామని భక్తులు, స్థానికులు, మీడియా సహకరించాలన్నారు. మన ఊరు, మనగుడి, మన ఉత్సవాలు అనేవిధంగా ప్రతి ఒక్కరు తోడ్పడాలన్నారు. స్థానిక శాసనసభ్యులు ఉత్సవాల నిర్వహణలో కీలకమైన ఆదేశాలు ఇస్తున్నారని ఆయన సూచనలు, ఆదేశాలను పాలకమండలి అధికారులు సమన్వయంతోపనిచేస్తున్నట్లు వివరించారు. జన్మకోశివరాత్రి అన్నట్లు మహాశివరాత్రి పర్వదినాన ప్రతి ఒక్కరికీ 'సుదర్శనం-సత్వర దర్శనం' కలిగేలా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామని పాలకమండలి తెలిపింది. గేట్లు, తాళాలు లేని క్యూలైన్లు గత కొన్నేళ్ళుగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణలోకి తీసుకుని ఈఏడాది ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. ముఖ్యంగా దక్షిణగోపురం నుంచి ప్రవేశించే భక్తులు, విఐపిలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఈసారి శివరాత్రి పర్వదినాన భక్తులకు క్యూలైన్లలో గేట్లు తాళాలు సంప్రదాయం ఉండదని స్పష్టం చేశారు. లింగోద్భవం సందర్భంగా తోపులాస, తొక్కిసలాట లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆలయంలోపల బయట భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శాశ్వత మరుగుదొడ్లతో పాటు మరో వంద మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని ఛైర్మన్ వివరించారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు జల్లికృష్ణయ్య, ఎన్.జయశ్యాం, సాధనమునస్వామి, ప్రకాశంపంతులు, పసలసుమతి, డి.జయమ్మ, ఎస్.లక్ష్మి, యం.రమాప్రభ, వి.చెంచులక్ష్మి, కొండూరుసునీత, యస్.మునిలక్ష్మి, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మహీధర్‌రెడ్డి, ఎక్స్ అఫిషియోసభ్యులు యంయంఎ.శ్రీకాళహస్తీశ్వరగురుకుల్, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, చింతామణి పాండు, మదన్‌మోహన్‌రెడ్డి, కె.శోభ, పి.లీల, యంపి.శ్రీదేవి, కె.మీనాక్షి, బి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎముకల సాంద్రత పటుత్వ పరీక్షలతో

ఎముకల బలోపేతం :ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్‌సుకుమార్



**తిరుపతినగరం, ఫిబ్రవరి 3ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి 40 సంవత్సరాలు పైబడిన తరువాత తప్పనిసరిగా ఎముకల సాంద్రత పటుత్వపరీక్షలు చేసుకోవాలని, దీనివల్ల తగిన జాగ్రత్తలు పాటిస్తే ఎముకలు సంబంధిత వ్యాధుల నుంచి నివారించుకోవచ్చుని సాయిసుధా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత, ఎముకల వైద్యనిపుణుడు డాక్టర్ బి.సుకుమార్ తెలిపారు. కాల్షియం తగ్గినపుడు ఎముకల అరుగుదల పటుత్వం తగ్గుతుందన్నారు. ఎముకల సాంద్రత పరీక్షలు చేసుకుని తగిన వైద్యం ,పౌష్టికాహారం తీసుకుంటే కీళ్ళనొప్పులు, మోకాళ్ళ నొప్పులు, నడుమునొప్పులు వంటి ఎముకలకు సంబంధించిన వ్యాధులను నియంత్రించుకోవచ్చన్నారు. శుక్రవారం ఉదయం రెడ్డిరెడ్డికాలనీలోని సాయిసుధా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంబిడి ఉచితవైద్యశిబిరం జరిగింది, వందమందికిపైగా హాజరై పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరఫీడాక్టర్‌సునీత, సుజాత, సులోచన, సతీష్, మహేష్, శ్రీనివాస్, గీతిక పాల్గొన్నారు.

## దేశాంతరాలు దాటినా

చదివిన కళాశాలపై తరగని మమకారం



**తిరుపతి, ఫిబ్రవరి 3ప్రభాతవార్త:** ఎక్కడో పుట్టి...ఇక్కడే కలిశాం... చదువలమ్మ చెట్టునీడలో అన్నట్లు ఉన్నతవిద్య నభ్యసించి ఎంతో ప్రయోజకులుగా మారి దేశాంతరాల్లో బిజీజీవితం గడుపుతున్నా చదువుకున్న కళాశాలపై ఏమాత్రం మమకారం తగ్గలేదు. ఎప్పుడో ఒకరోజు మాతృభూమి, చదువుచెప్పిన గురువులు, చదువుకున్న పాఠశాల, కళాశాలల తీపిగురుతులుగా నిలచిపోతాయి. ఇదీ నిజమని చాటిచెబుతూ 1996వ సంవత్సరం నెల్లూరు విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌డి ఇంజనీరింగ్ కళాశాలలో 1992-96 బ్యాచ్ సిల్వర్ జూబ్లీ పూర్వవి ద్యార్థుల కలయికతో శుక్రవారం ఆ కళాశాల వాతావరణం మారిపోయింది. ఈ కార్యక్రమానికి పూర్వపు అధ్యాపకులు ప్రస్తుత డైరెక్టర్ వివికె రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పూర్వ ప్రిన్సిపాల్ జి.ప్రభాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఆర్‌ఐలు నామాల వెంకట్‌శివానందరెడ్డి, మదనపల్లి శ్రీధర్, తాతిరెడ్డి వినోద్, కొమ్మినేని, విజయ్, కొత్తపల్లి బాపూజీ, చౌటి ప్రదీప్‌రెడ్డి, మల్లికార్జున కైపు, స్థానికులు రంగయ్య, అనీల్ నీలి, పాపిరెడ్డి ,అంజయ్య, విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక జరిగింది. దాదాపు 25 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో కళాశాలలో గడిపిన రోజులు, తీపిజ్ఞాపకాలు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు కళాశాల సిబ్బందితో గడిపిన మధురక్షణాలు గుర్తుచేసుకున్నారు. కుటుంబకోసం, పిల్లల ఎదుగుదల కోసం, భవిష్యత్తుకోసం తిరుపతిలోని టిపి ఏరియాలో ఉన్న హోటల్ సింధూరి పార్కులో కలుసుకున్నారు. పాటలు, నృత్యాలు, స్నేహితుల మధ్య సంభాషణలతో ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమానికి అమెరికా నుంచి పదిమంది,

## జాతరలో దుకాణాల విక్రయాలకు వేలం పాటలు

**చిల్లకూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తూర్పు కనుపూరు గ్రామంలో ముత్యాలమ్మ జాతర మార్చి 14 నుండి 17 వరకు నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద ఇనస్పెక్టర్ శ్రీలతఆద్వర్యంలో జాతరలో కొబ్బరి చక్కలు స్వీకరించే 2 లక్షలా 13 వేలు, దేవస్థానం ప్రాంగణంలో పూలమాలలు అము ్మకునే హక్కు 49 వేలు, పాదరక్షకులు రుసుం 76 వేలు, సిద్దవరం వైపు పార్కింగ్ 65 వేలు, ఈదూరువారిపాలెం పార్కింగ్ 76 వేలు పాటదారులు పాడుకోవడం జరిగింది. అనంతరం జాతర అయిన తరువాత నుండి సంవత్సరం పాటు వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వేలం పాట నిర్వహించగా టెంకాయలు పూజాద్రవ్యాలు 11 లక్షలా 41 వేలకు ,కొబ్బరి చక్కలు 2 లక్షాల 5 వేలకు తలనీలాలు 4 లక్షల 30 వేలకు ,వేయికళ్ల కుండలు లక్షా 60 వేలకు అమ్మవారి కి దున్నపోతులు 5 లక్షలా 60 వేలకి అమ్మవారిఆలయం డాలర్లు, క్యాలండెర్లు, తాయిత్తులు అమ్ముకునే హక్కు 3 లక్షాల 30 వేలకు దేవస్థానం వద్ద టాయిలేట్ రుసుం ఒకలక్షా 67 వేలు ,క్లాత్ పందిరిలు, హైరర్స్‌కి వచ్చి 65 వేలు, వాహనాల పార్కింగ్ కోసం లక్షా 12 వేలు పాదరక్షల రుసుం 5 వేల 5 వందలకు పాడుకోవడం జరిగిందని ఆలయ ఇఒ కోవూరు జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 5 లక్షలా 26 వేలు వచ్చినట్లు ఇఒ నవీన్‌కుమార్‌తెలిపారు.

## పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాల లబ్ది : మంత్రి పెద్దిరెడ్డి



**రొంపిచెర్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాల లబ్ది అందుతోందని రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్ల మండలంలో శుక్రవారం నుంచి పల్లెబాట కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె పంచాయతీలలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహనరెడ్డి ఎన్నికల హామీలను నెరవేర్చడం జరుగుతున్నదని, రాష్ట్రంలో పారదర్శకమైన పాలన కొనసాగుతున్నదని ప్రతి పథకం ఇంటి ముంగిట అందేలా చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి కుళాయిద్వారా నీరు అందించేందుకుఇప్పటికే ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ ట్యాంకుల నిర్మిస్తున్నామని త్వరలోనే ఇంటింటికి కొళాయి ద్వారా నీరు అందజేస్తామని చెప్పారు. ప్రతి పొలానికి సాగునీరు అందించేందుకు కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే రోడ్లు భవనాలు వంటివి నిర్మించి అభివృద్ధి కనపడేలా చేసామన్నారు. నియోజకవర్గంలో దాదాపు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పల్లెబాటలో ఎటువంటి సమస్యలు లేవని తమకు లక్షల రూపాయల లబ్ది చేకూరుతుందని మహిళలు చెపుతుంటే సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. అదేవిధంగా గర్భవతులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మెన్ గోవిందప్ప శ్రీనివాసులు, టిటిడి పాలకమండల సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పలమనేరు, కుప్పం మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అధారిటి చైర్మెన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్‌రెడ్డి, నూలురెడ్డెప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు హరినాదరెడ్డి, తహశీల్దారు అమరనాద్, ఎంపీడీఓ దేవేంద్రనాద్, సర్పంచిలు ఇబ్రహీంఖాన్, వేమూరి ప్రసాద్‌నాయుడు, నాయకులు సూర్యనారా యణరెడ్డి, వెంకటరమణ, ఉమాపతి, మునస్వామినాయుడు, తులసినాయుడు, పరందామనాయుడు, రాజేష్, రెడ్డి ప్రసాద్, ప్రజాప్రతి నిధులుపాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థినుల ప్రతిభ.



**పెద్దపంజాణి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం శంకరాయలపేట మహాత్మజ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభచూపారు. ఇటీవల విశాఖపట్టణం జిల్లా సింహచలంలో జరిగిన బాలికలు హ్యాండ్‌బాల్ గ్రూప్ స్థాయిపోటీలో మెదటిస్థానం సాధించారు. అథ్లెటిక్స్ గ్రూపు ఈవెంట్‌లో ద్వితీయస్థానం సాధించారు. వ్యక్తిగత బాలికల క్రీడలలో కె.జోతిశ్రీ జావెలిన్ లో మెదటిస్థానం, 400మీటర్లు, 200మీటర్లు పరుగుపందెంలో మెదటి, ద్వితీయ స్థానం, లాంగ్‌జెంప్‌లో ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి ఇండూజ్వల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థినులను, పిఇటి ఉపాధ్యాయులను కన్వీనర్ ప్రిన్సి పాల్ వై.సోమశేఖర్, ప్రిన్సి పాల్ ఎ.జోత్స్న, ఉపాధ్యాయులు అభినందించారు.

## బిసిఎం హైస్కూల్‌లో ఘనంగా ఆపిల్ దినోత్సవం!



**తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** స్థానిక మంగళంలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బిసిఎం హైస్కూల్) నందు శుక్రవారం 'ఆపిల్' దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల వ్యవస్థాపకులు కృష్ణమూర్తినాయుడు మాట్లాడుతూ ఆపిల్ అనేది అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన అత్యంత పోషక విలువలు కలిగిన పండని, వీటిలో ఫైబర్ మరియు ఆంటీ ఆక్సిడెంట్లు చాలా ఉన్నాయన్నారు. ఆపిల్స్‌ను తినడం వలన మధుమేహం, గుండె జబ్బులు, కేన్సర్‌తో సహ అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని తెలిపారు. యాపిల్స్ బరువు తగ్గడానికి అలాగే గట్ మరియు మెదడు ఆరోగ్యవంతంగా పనిచేయడానికి సహాయపడుతుందని ఆయన వివరించారు. ఆపిల్ డే సందర్భంగా విద్యార్థులందరూ ఆపిల్ రంగు దుస్తులు ధరించి వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ ప్రియ, ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయానికి ఆభరణాలు కానుక



**తిరుచానూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** స్థానిక యోగిమల్లవరంలో వెలసిన అతి పురాతన శ్రీ కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు ఆలయానికి వెచ్చించడం జరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆయన సతీమణి మధు విలువైన బంగారు ఆభరణాలను ఆలయానికి కానుకగా అందచేశారు. అలాగే మరో భక్తులు ప్రముఖ వైద్యులు డా॥కృష్ణప్రశాంతి, డా॥హరినథ్‌రెడ్డి దంపతులు వెండి దీపస్థంభాలను కానుకగా అందచేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అర్చకులు మూర్తి గురుకుల్ తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## 5న త్రిశూల స్నానానికి సన్నాహాలు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవానికి వేలాది మంది మహిళా భక్తులు వస్తారు. కాబట్టి ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని ఇఓ, ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. శివరాత్రి ఉత్సవాలకు ముందు నిర్వహించే ఉత్సవం ఏటి ఉత్సవం, సద్యోముక్తి వ్రతం. ఈ ఉత్సవం ఈ ఏడాది ఈ నెల 5న వచ్చింది. ఆదివారం కాబట్టి భారీ ఎత్తున భక్తులు హాజరుతారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టారు. చైర్మెన్ పట్టుబట్టి శాశ్వత ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఉత్సవంతో పట్టణ వాసులకు శివరాత్రి సంకేతాలు వెళతాయి. ఈ ఏడాది శాసనసభ్యుని సూచనలతో ధర్మకర్తల మండలి, అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న మహాశివరాత్రి కాబట్టి అధికారులు ముందుజాగ్రత్తగా చక చకా పనులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక చలవనను ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు సంబంధించి ఎప్పటి కప్పుడు శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి సమీక్షించుకుంటూ ధర్మకర్తల మండలికి సూచనలిస్తున్నారు.

**సద్యోముక్తి ఉత్సవం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో మహాశివరాత్రికి ముందు వచ్చే పెద్ద ఉత్సవం 'త్రిశూల స్నానం' ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లే. ఈ ఉత్సవాల్ని ఆ రోజు నదిలో సద్యోముక్తి ప్రాధాన్యతను వివరిస్తారు. త్రిశూలాన్ని పవిత్ర సువర్ణముఖి నది జలాల్లో స్నానమాచరింపజేస్తారు. ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేయుటకు ఇఓ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. ఉత్సవం అనంతరం గ్రామంలో పంచమూర్తుల్ని ఊరేగిస్తారు.

## శివయ్య సేవలో రష్యా భక్తులు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయానికి రష్యాకు చెందిన నలుగురు భక్తులు విచ్చేశారు. శివయ్యను దర్శించుకున్న అనంతరం ఆలయంలో శిల్పకళను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పంచభూతలింగాల్లో వాయులింగేశ్వరుడుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరున్ని అమ్మవారిని దర్శించుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం తేరువీధిలో మహాశివరాత్రికి సిద్దంగా ఉన్న రథాలను పరిశీలించారు. రథాల విషయం తెలియకపోవడంతో అక్కడే విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ ఎఎస్ఐ రియాజ్‌బాషాతో మాట్లాడారు. దీంతో ఆయన స్పందించి శ్రీకాళ హస్తి విశిష్టత, త్వరలో జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని వారికి వివరించారు.

## నారా లోకేష్‌కు ఘన స్వాగతం

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** యువగళం పాదయాత్ర మొగిలి నుండి శుక్రవారం ప్రారంభించిన తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు ప్రతి పల్లెలో ఘన స్వాగతం లభించింది. మొగిలీశ్వరుడి దర్శన అనంతరం మొగిలిలో పాదయాత్రను నారా లోకేష్ ప్రారంభించారు. పరిసర గ్రామస్తులు, టిడిపి కార్యకర్తలు నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. గాండ్లపల్లిలో రైతులు లోకేష్‌తో మాట్లాడుతూ తమ పంటలకు ఏనుగుల వల్ల భారీ నష్టం వాటిల్లుతుందని చెప్పారు. బలిజపల్లిలో ఏనుగు వల్ల మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం ఇంత వరకు అందలేదని నారా లోకేష్ దృష్టికి రైతులు తీసుకువచ్చారు. బలిజపల్లి వద్ద చిత్తూరు నగర మాజీ మేయర్ కఠారి హేమలత నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. పాలమాకులపల్లి వద్ద టిడిపి నాయకులు రఘు ఆధ్వర్యంలో మహిళలు నారా లోకేష్‌కు మంగళ హారతులు ఇచ్చారు. శేషాపురంలో తెలుగు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. అండారెడ్డిపల్లి వద్ద మాజీ సర్పంచ్ అమరావతమ్మ తమ అనుచరులతో నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం బంగారుపాళ్యం జామియా మసీదుకు వెళ్ళిన నారా లోకేష్‌కు మైనార్టీ నాయకులు పలు విషయాలు దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం తగ్గువారిపల్లిలో పాదయాత్ర వంద కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తన సొంత నిధులతో డయాలసిస్ యూనిట్ మంజూరుకు నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. ఈ పాదయాత్ర కొత్తపల్లి, కరిడివారిపల్లి, వజ్రాలపురం విడిది కేంద్రం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాల్లో పీలేరు, పుంగనూరు పార్టీ ఇన్‌ఛార్జీలు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డిలు, జిల్లా టిడిపి అధ్యక్షులు పులివర్తినాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు బుస్సా నాగరాజు, శివ, చిన్నా, నాసిర్, ఆరీఫ్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.